అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 277 | వరంగల్ | శుక్రవారం, 07 ఆగస్టు 2026 | పేజీలు: 10

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీరుపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకురాలు, వరంగల్ పశ్చిమ శాసనసభ నియోజకవర్గ కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ క్రెడిట్ కొట్టేయడం తప్ప, నగర అభివృద్ధికి ఎమ్మెల్యేగా ఆయన చేసిందేమీ లేదని తీవ్రంగా విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాడు రావు పద్మారెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రేటర్ వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని స్పష్టం చేశారు. స్మార్ట్ సిటీ పథకం ద్వారా రూ.500 కోట్ల నిధులతో నయీంనగర్ నాలా, 100 ఫీట్ రోడ్ , ప్రధాన రోడ్లు, పబ్లిక్ గార్డెన్, సెంట్రల్/రీజినల్ లైబ్రరీల పునర్నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, జంక్షన్ల అభివృద్ధి, వడ్డేపల్లి చెరువు కట్ట అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు.

*- అక్షరశక్తి, హన్మకొండ*

## గ్రేటర్ వరంగల్‌కు

# కేంద్రమే అండ

మహా నగర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

పనులన్నీ కేంద్రం ఇస్తున్న వందల కోట్ల నిధులతోనే..

క్రెడిట్ కొట్టేయడమే ఎమ్మెల్యే నాయిని పని

నగర అభివృద్ధికి రాజేందర్ రెడ్డి చేసింది శూన్యం

బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి

4






# నా భర్తను ఎలాగైనా చంపు

- ప్రియుడికి భార్య మెసేజ్..
- పోలీసులకు భర్త ఫిర్యాదు
- మహబూబాబాద్ జిల్లాలో సంచలనం..

డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో ఓ సంచలన ఘటన వెలుగుచూసింది. తనను ఎలాగైనా చంపాలని భార్య తన ప్రియుడికి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సందేశాలు పంపినట్లు ఆరోపిస్తూ బాధిత భర్త పోలీసులను ఆశ్రయించాడు.

*- అక్షరశక్తి, మహబూబాబాద్*

3



## ఆర్బీఐ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని

# కరెన్సీ నోట్లపై ముద్రించాలి

**కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

అక్షరశక్తి, వరంగల్: భారతదేశ ఆర్థిక వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) రూపకల్పనకు మార్గదర్శకుడైన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని భారత కరెన్సీ నోట్లపై ముద్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు.

3





# రక్తదానం ప్రాణదానంతో సమానం: కేయూ రిజిస్ట్రార్

**అక్షరశక్తి, హనుమకొండ:** సమాజంలో మానవత్వాన్ని చాటే అత్యున్నత సేవ రక్తదానమని, ఒక వ్యక్తి చేసిన రక్తదానం మరో వ్యక్తికి ప్రాణదానంతో సమానమని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ నిరంతరం రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈస్ ఎం నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రెహమాన్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు డాక్టర్ శ్రీదేవి, శ్రీలత, డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 100 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ బృంద ఆధ్వర్యంలో రక్త సేకరణ నిర్వహించి దాతలకు ప్రశంసాపత్రాలు అందజేసింది.

# పెండింగ్ డిఏలు, పిఆర్సి ప్రకటించాలని కోరుతూ నిరసన



**అక్షరశక్తి, హనుమకొండ:** పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల యొక్క సమస్యలను పరిష్కరించాలని ఆరు విడతల డి ఏ ను ,పిఆర్ సీని వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హనుమకొండ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పెండెం రాజు, జి ఉప్పలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల శిక్షణ శిబిరంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రభుత్వం ఎన్నికైన ఆరు నెలల్లో పిఆర్సి, డీఏలు వెంటనే అమలు చేస్తామని హామీలు ఇచ్చి నేటికీ మూడు సంవత్సరాలు గడిచాయని, ఇప్పటిక కనీసం పిఆర్సి నివేదికను కూడా ఇంకా విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. అలాగే గతంలో ఎన్నడు ఏ ప్రభుత్వంలో లేని విధంగా ఆరు డి ఏ లు పెండింగ్లో పెట్టిందని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అలాగే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో నగదు రహిత వైద్యం అందే విధంగా హెల్త్ కార్డులు ఇవ్వాలని అన్నారు ..అలాగే రిటైర్ అయిన ఉపాధ్యాయుల పెండింగ్ పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని అన్నారు.. ప్రభుత్వం ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే ఆగస్టు 19 న జిల్లా కేంద్రంలో ధర్నా, ఆగస్టు 29 న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు సిఎస్ఆర్ మల్లిక్, బి వెంకటేశ్వరరావు నరేష్ ,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- **చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలకు భరోసా**
- **వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**అక్షరశక్తి,హనుమకొండ:** చేనేత కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అన్నారు. తెలంగాణలో చేనేత రంగానికి విశిష్టమైన చరిత్ర ఉందని, ముఖ్యంగా వరంగల్ ప్రాంతం దేశవ్యాప్తంగా చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత రంగానికి చేయూతనిచ్చే విధంగా డిపిఆర్ తయారుచేసి ఇవ్వాలని, డిపిఆర్ ను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేతను కాపాడుకుంటూ చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించిన విధంగా చేనేత సంఘం ప్రతినిధులు చేనేత సంక్షేమానికి డిపిఆర్ తయారుచేసి అందించాలని తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించడంతో పాటు చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించి చేనేత వస్త్రాలతో సన్మానించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్ ను సందర్శించి చేనేత చీరను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ఏడీ విజయలక్ష్మి, చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మామిడాల శైలజ కథాసంపుటి ఆవిష్కరణ

**అక్షరశక్తి,వరంగల్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగసాయిపేటలో ప్రముఖ కవయిత్రి, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మామిడాల శైలజ రచించిన "కాలాతీతమైంది" కథాసంపుటి శుక్రవారం ఘనంగా ఆవిష్కరించబడింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ, డాక్టర్ మామిడాల శైలజ సాహిత్య రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తూ ఇప్పటికే వివిధ ప్రక్రియల్లో ఏడు పుస్తకాలు రచించడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. పాఠకుల అభిరుచులకు అనుగుణంగా రచనలు చేయడం ఆమె ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఆమె రచనలు అనేక అవార్డులు, పురస్కారాలు అందుకోవడం ఆనందదాయకమని, కళాశాలలో ఇలాంటి ప్రతిభావంతురాలు ఉండడం సంస్థకు మరింత గుర్తింపు తీసుకొస్తోందని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఆర్. ప్రేమలత,




అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. పరమేష్, అధ్యాపకులు డాక్టర్ పి.ఎల్.ఎన్. మూర్తి, డాక్టర్ భగీరద్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సుస్మిత, డాక్టర్ నాగ పరమేష్, డాక్టర్ మీనాజుద్దీన్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రాజన్న, డాక్టర్ ప్రభావతి, ఆశాజ్యోతి, ప్రదీప్, గీత, కమలాకర్ తదితరులు పాల్గొని రచయిత్రిని అభినందించారు.


# విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణకు సోలార్, బ్యాటరీ స్టోరేజ్‌పై దృష్టి

అక్షరశక్తి,హనుమకొండ: విద్యుత్ సరఫరాను మరింత సమర్థవంతంగా, నాణ్యంగా తీర్చిదిద్దేందుకు సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లు, కెపాసిటర్ బ్యాంకుల వినియోగాన్ని విస్తరించాలని ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో సోలార్, బ్యాటరీ స్టోరేజ్ ఏర్పాటుతో పాటు 347 సబ్‌స్టేషన్లలో 2 MVAR కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు వివరాలను ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. పీక్ అవర్స్‌లో నిల్వ విద్యుత్ వినియోగంతో విద్యుత్ కొనుగోలు వ్యయం, ట్రాన్స్‌మిషన్ నష్టాలు తగ్గుతాయని తెలిపారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక గ్రిడ్ నిర్వహణ, సోలార్, బ్యాటరీ స్టోరేజ్, కెపాసిటర్ బ్యాంకుల సమన్వయంతో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యంగా పనిచేస్తామని నవీన్ మిట్టల్ పేర్కొన్నారు.



# నా భర్తను ఎలాగైనా చంపు...

- ప్రియుడికి భార్య మెసేజ్..
- పోలీసులకు భర్త ఫిర్యాదు
- మహబూబాబాద్ జిల్లాలో సంచలనం..




**అక్షరశక్తి, మహబూబాబాద్:** డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో ఓ సంచలన ఘటన వెలుగుచూసింది. తనను ఎలాగైనా చంపాలని భార్య తన ప్రియుడికి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సందేశాలు పంపినట్లు ఆరోపిస్తూ బాధిత భర్త పోలీసులను ఆశ్రయించాడు.
బాధితుడు గాదే రాజేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో తనకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, భవాని సైదులు అనే కొరియర్ బాయ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు ఇటీవల తనకు తెలిసిందని పేర్కొన్నాడు.
ఈ విషయం గత నెల 27న బయటపడటంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు తెలిపాడు. అనంతరం తన అన్నను తీసుకురావడానికి వెళ్తుండగా సైదులు తనను వెంబడించాడని ఆరోపించాడు. అతడి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకున్న తర్వాత భార్య మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా, "ఎలాగైనా నా భర్తను చంపు.. లేకపోతే నేను చనిపోతా" అంటూ సైదులుకు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో సందేశాలు పంపినట్లు గుర్తించినట్లు తెలిపాడు. ఆ చాటింగ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్లు తీసుకుని భార్య భవాని, ఆమె ప్రియుడు సైదులుపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజేశ్వరరావు వెల్లడించాడు. అయితే తొలుత పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో మరోసారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని రూరల్ సీఐ హామీ ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు.

# ఆర్బీఐ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ








**అక్షరశక్తి, వరంగల్:** భారతదేశ ఆర్థిక వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు, భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) రూపకల్పనకు మార్గదర్శకుడైన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని భారత కరెన్సీ నోట్లపై ముద్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫోటో కరెన్సీ పై ముద్రించాలని, దేశ నిర్మాణంలో చేసిన సేవలు, ముఖ్యంగా సామాజిక, ఆర్థిక, రాజ్యాంగ రంగాల్లో ఆయన అందించిన విశిష్టమైన కృషిని కొనియాడారు. అంబేద్కర్ గారి ఆలోచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం ఎంపీ మల్లు రవి, ప్రొఫెసర్ కాసిము తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.
తదుపరి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి ఆర్థికవేత్త అని అన్నారు. 1929లో ఆయన చేసిన ఆర్థిక పరిశోధనలు, ప్రతిపాదించిన ఆర్థిక సిద్ధాంతాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమైన మార్గదర్శకత్వాన్ని అందించాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు ఏర్పడిన సమయంలో భారతదేశానికి బలమైన ఆర్థిక వ్యవస్థ అవసరాన్ని అంబేద్కర్ తన ఆలోచనలు, పరిశోధనల ద్వారా ముందుగానే గుర్తించారని, ఆయన ఆర్థిక ఆలోచనలు భారతదేశంలో కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థకు బలమైన పునాది ఏర్పడటానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాలకు ఆర్థిక ఆలోచనల్లో దిశానిర్దేశం చేసిన మహోన్నత ఆర్థికవేత్త అని డాక్టర్ రామకృష్ణ అన్నారు. అలాంటి మహనీయుడి సేవలకు గుర్తింపుగా భారత కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి చిత్రాన్ని ముద్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. అంబేద్కర్ ఆర్థిక ఆలోచనలు, పరిశోధనలు, దేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ఆయన చేసిన కృషిపై మరింత విస్తృతంగా అధ్యయనం చేసి యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ మాదిగ తదితర పలువురు ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, నాయకులు, ఇతరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కార్యదర్శి సైదులు



**అక్షరశక్తి,వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దామెర మండలం ఒగ్లాపూర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలను ఎంజేపీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి సైదులు (IFS) శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను, వసతులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మెనూ అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీఓ) రాజ్‌కుమార్‌తో పాటు పాఠశాల అధికారులు పాల్గొన్నారు.



## ఆరోగ్యశ్రీ పథకం ఎమ్మార్పీఎస్

# ఉద్యమ ఫలితమే

### మందకృష్ణ మాదిగ

**అక్షరశక్తి,కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్లో శుక్రవారం ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవ సమావేశం ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ, 2004 ఆగస్టు 7న ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమ ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత శస్త్రచికిత్సలు, పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో సాగిన ఉద్యమం ఫలితమే ఆరోగ్యశ్రీ అని అన్నారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పథకం నిరుపేదలకు సంజీవనిలా ఉపయోగపడుతోందని తెలిపారు.ఆరోగ్యశ్రీ పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కులం, మతం కంటే మానవత్వమే ముఖ్యమని, సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు కొనసాగాలని పిలుపునిచ్చారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జానపురెడ్డి కృష్ణవేణి, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, డా. పోడేటి శ్రీనివాస్, డా. పుల్ల శ్రీనివాస్, డా. సంకినేని వెంకట్‌తో పాటు ఎంఎస్‌ఎఫ్ నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాత్కాలిక అధ్యాపకులందరినీ క్రమబద్ధీకరించాలి




**అక్షరశక్తి, హన్మకొండ :** దేశవ్యాప్తంగా ఈరోజు ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ యూనివర్సిటీలు కళాశాల ముందు ధర్నా కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నాడు కళాశాల ముందు అధ్యాపకులు ధర్నా నిర్వహించటం జరిగింది ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐఫక్టో నాయకులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు మరియు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్,పార్ట్ టైం, గెస్ట్ అధ్యాపకులు అందర్నీ క్రమబద్ధీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లు, 2025 ను ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో కళాశాల ముందు ధర్నా నిర్వహించటం జరిగింది ఈ ధర్నా కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కే.వీరస్వామి, డాక్టర్ శేషు, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ చింతం ప్రవీణ్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ మాధవి, డాక్టర్ నవీన్, డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ శంకర్, హరి, డాక్టర్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీ కళాశాలలో ఎన్‌సీసీ ప్రవేశాలు



**అక్షరశక్తి, వరంగల్ :** వరంగల్‌లోని లాల్ బాహదూర్ కళాశాల క్రీడామైదానంలో 10వ తెలంగాణ ఎన్సిసి బెటాలియన్ యూనిట్లో 2026 27 ఎన్సిసి ప్రవేశాలు జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి హెచ్ రావు తెలిపారు. ఎన్సిసి ఫోర్స్ పూర్తి చేసుకుంటే భారత ఆర్మీలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని దేశ సేవ కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్సిసి అడ్మిషన్ పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కఠోరమైన ఎంపిక విధానంలో జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ఎంపికల కోసం 10 తెలంగాణ బెటాలియన్ జూనియర్ కమిషన్ ఆఫీసర్ మారుతి ముగ్దమ్, పి.నిషాద్ ఎన్ సి ఓ, కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, హరి లోకేష్, రవళి, గోకుల్, షాహీల్, యాసారు, నిఖిల్ పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు



**అక్షరశక్తి, పరకాల:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను బిట్స్ స్కూల్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో బోనం ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొనగా, విద్యార్థులు పోతురాజు వేషధారణ, జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, "బోనాల పండుగ అనేది తెలంగాణ ప్రజల విశ్వాసానికి, అమ్మవారి పట్ల ఉన్న అచంచల భక్తికి ప్రతీక. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. విద్యార్థులు పుస్తక విజ్ఞానంతో పాటు భారతీయ సంస్కృతి, తెలంగాణ సంప్రదాయాలను కూడా తెలుసుకొని ఆచరించాలి. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పాఠశాల పరకాల ప్రధానోపాధ్యాయులు డి. సంజయ్ కుమార్ పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని బోనాల సంబరాలను విజయవంతం చేశారు.

## పసి పిల్లల ఆరోగ్యానికి పునాది తల్లిపాలు



**అక్షరశక్తి, వరంగల్ :** తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రేటర వరంగల్ 42 డివిజన్ అంగన్వాడీ కేంద్రాలు సందర్శించి ఆదర్శ కాలనీ నందు సిడిఎస్ వరంగల్ ప్రాజెక్టు ఉర్సు సెక్టార్ సూపర్వైజర్ బత్తిని రమాదేవి హాజరై మాట్లాడారు. ప్రతి గర్భిణీ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే బిడ్డ మూడు కిలోల బరువు పెరుగుతుందని శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలని కేవలము ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని ఏడో నెల నుండి అనుబంధాహారము ప్రారంభిస్తూ కనీసం మూడు సంవత్సరాలు పిల్లలకు పాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లల గృహాలు, ఆస్పత్రులు సందర్శించి ఆసుపత్రిలో డెలివరీ అయిన తల్లులకు తల్లిపాలు పట్టించే విధానము తల్లులకు పోషణ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏఎల్ఎమ్ఎస్సీ కమిటీ సభ్యులు మనిషా సౌమ్యశ్రీ రమ్య ప్రియదర్శిని రాణి అంగన్వా టీచర్ అనిత ఆయా యమున తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**అక్షరశక్తి, పరకాల :** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పరకాల టౌన్, పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాల పరిధిలోని 56 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్యతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు దనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు.పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరకాల ఇందిరా మహిళా డైరీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్,రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్,సన్న బియ్యం పంపిణీ,మహాలక్ష్మి ,గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.



# గ్రేటర్ వరంగల్‌కు కేంద్రమే అండ

- మహా నగర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం
- పనులన్నీ కేంద్రం ఇస్తున్న వందల కోట్ల నిధులతోనే..
- క్రెడిట్ కొట్టేయడమే ఎమ్మెల్యే నాయిని పని
- నగర అభివృద్ధికి రాజేందర్ రెడ్డి చేసింది శూన్యం
- బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి



**అక్షరశక్తి, హన్మకొండ :** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీరుపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకురాలు, వరంగల్ పశ్చిమ శాసనసభ నియోజకవర్గ కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ క్రెడిట్ కొట్టేయడం తప్ప, నగర అభివృద్ధికి ఎమ్మెల్యేగా ఆయన చేసిందేమీ లేదని తీవ్రంగా విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాడు రావు పద్మారెడ్డి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రేటర్ వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని స్పష్టం చేశారు. స్మార్ట్ సిటీ పథకం ద్వారా రూ.500 కోట్ల నిధులతో నయీంనగర్ నాలా, 100 ఫీట్ రోడ్ , ప్రధాన రోడ్లు, పబ్లిక్ గార్డెన్, సెంట్రల్/రీజినల్ లైబ్రరీల పునర్నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, జంక్షన్ల అభివృద్ధి, వడ్డేపల్లి చెరువు కట్ట అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు.

**వందల కోట్ల నిధులు..**

రైల్వే ప్రాజెక్టులు అండ్ మౌలిక వసతులు కల్పన, రవాణా అండ్ ఇతర అభివృద్ధి నిధులలో భాగంగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి రూ.521.36 కోట్లు, కాజీపేట స్టేషన్ అభివృద్ధికి రూ.24.45 కోట్లు, విజయవాడబల్లార్షా 3వ రైల్వే లైన్లకు దాదాపు రూ.4,850 కోట్లకు పైగా నిధులు, కాజీపేట బైపాస్ లైన్‌కు రూ.125 కోట్లను కేంద్రం మంజూరు చేసిందని, మామునూర్ ఎయిర్‌పోర్ట్ మొదటి విడత పనులకు రూ.500 కోట్లు, ఔటర్ రింగ్ రోర్డ్ (నార్త్ సైడ్) నిర్మాణానికి రూ.30 కోట్లు, నగర రవాణా కోసం పీఎం ఈబస్' పథకం కింద 100 విద్యుత్ బస్సులు మంజూరయ్యాయి ఇవే కాకుండా ఇటీవల మరో 100 విధ్యుత్ బస్సులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని పద్మారెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమం, పట్టణాభివృద్ధి కోసం పీఎం స్వనిధి ద్వారా 62,937 మంది వీధి వ్యాపారులకు రూ.117.56 కోట్ల రుణాలు ఇచ్చారని పద్మారెడ్డి తెలిపారు. హృదయ్ (HRIDAY) పథకం కింద రూ.33 కోట్లు, అమృత్ (AMRUT) స్కీమ్ కింద మంచి నీటి సరఫరాకు ₹274.25 కోట్లు, అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా రూ.1,550 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసారని స్పష్టం చేసారు.

**పనులన్నీ కేంద్రానివే..**

ఈరోజు వరంగల్ మహానగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా కేంద్ర ప్రభుత్వ 14, 15, 16వ ఆర్థిక సంఘం నిధులతోనే నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటికల నిర్మాణం జరుగుతోందని, చివరికి ఎమ్మెల్యే రెండురోజుల క్రితం, దర్గాలో ప్రారంభించిన రూ.50 లక్షల సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ పనులు కూడా కేంద్రం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులేనని తేల్చిచెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. కేంద్రం ఇస్తున్న వేల కోట్ల నిధులను మళ్లించడం లేదా తమ ఖాతాలో వేసుకోవడం మాని, అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం వహిస్తే, భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. ప్రజల సంక్షేమం, వరంగల్ నగర అభివృద్ధి మాత్రమే బిజెపి ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

## నేరాల నియంత్రణలో రాజీలేని పోలీసింగ్‌కు ప్రాధాన్యం



**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.**

**అక్షరశక్తి, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, జిల్లాలో నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రతి కేసులో నాణ్యమైన, శాస్త్రీయ దర్యాప్తు నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి పారదర్శకత, సమాచార సమన్వయం, ప్రజలకు అందించే సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి రవాణా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసులు, వారెంట్లు, పిటిషన్ల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

**టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరి అశోక్**

**అక్షరశక్తి, వరంగల్:** యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాలుగు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా మొదటి దశ పోరాటం శుక్రవారం నాడు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



అందులో భాగంగా వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రంగశాయిపేటలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అలాగే ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చంత వరకు ఉపాధ్యాయులందరూ రోజూ పాఠశాలకు నల్ల బ్యాడ్జీలతోనే హాజరవుతూ నిరసన తెలుపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరి అశోక్, జిటిఏ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వీరాచారి, ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, సునీల్ కుమార్, ఉషారాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# గ్రంథాలయాల శాస్త్రంలో పరిశోధనలు ప్రభావం, భావన, పరిణామం, మారుతున్న పాత్ర



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

గతంలో విశ్వవిద్యాలయాలు పరిశోధన నాణ్యతను ప్రధానంగా సహచర సమీక్ష (పీ.ఆర్.) ఆధారంగా అంచనా వేసేవి. ఒక పరిశోధన వ్యాసాన్ని అదే రంగానికి చెందిన నిపుణులు పరిశీలించి దాని శాస్త్రీయ నాణ్యతను నిర్ణయించే ఈ విధానం ఇప్పటికీ అత్యంత ప్రామాణికమైన పద్ధతిగానే పరిగణించబడుతోంది. అయితే ప్రపంచవ్యాప్తంగా పరిశోధన ప్రచురణలు వేగంగా పెరగడం, అంతర్జాతీయ సహకార పరిశోధనలు విస్తరించడం, డిజిటల్ ప్రచురణ వ్యవస్థలు అభివృద్ధి చెందడం వల్ల కేవలం సహచర సమీక్ష మాత్రమే సరిపోదనే అభిప్రాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పరిశోధన ప్రభావాన్ని సంఖ్యాపరంగా కూడా కొలిచే పద్ధతులు అభివృద్ధి చెందాయి.
ఈ క్రమంలో గ్రంథసూచి గణాంక విశ్లేషణ (బిబ్లియోమెట్రిక్స్ - బి.ఎం.), శాస్త్రీయ గణాంక విశ్లేషణ (సైంటోమెట్రిక్స్ - ఎస్.ఎం.), ఉటంకింపు విశ్లేషణ (సిటేషన్ అనాలిసిస్ - సి.ఏ.), ప్రత్యామ్నాయ ప్రభావ సూచికలు (ఆల్ట్‌మెట్రిక్స్ - ఏ.ఎం.) వంటివి ఈ అధ్యయన రంగాలు అభివృద్ధి చెందాయి.

**వీటి యొక్క ప్రధాన ఉద్దేశం:**
ఒక పరిశోధనను ఎంతమంది చదివారు? ఎన్ని సార్లు ఉటంకించారు? ప్రపంచవ్యాప్తంగా దాని ప్రభావం ఎంత వరకు విస్తరించింది? వంటి అంశాలను కొలవడానికి పై పద్ధతులు ఉపయోగపడుతున్నాయి.
అయితే పరిశోధన ప్రభావాన్ని కేవలం ఉటంకింపుల సంఖ్యతో మాత్రమే కొలవలేము. ఒక వైద్య పరిశోధన ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచి ఉండవచ్చు. ఒక వ్యవసాయ పరిశోధన రైతుల ఆదాయాన్ని పెంచి ఉండవచ్చు. ఒక విద్యా పరిశోధన లక్షలాది మంది విద్యార్థులకు ఉపయోగపడి ఉండవచ్చు. ఇలాంటి సామాజిక, ఆర్థిక, పర్యావరణ, సాంకేతిక ప్రభావాలను కూడా నేడు పరిశోధన మూల్యాంకనంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. అందువల్ల ఆధునిక పరిశోధన ప్రభావ భావన అనేది బహుముఖ స్వరూపాన్ని సంతరించుకుంది.
ఈ పరిణామంతో పాటు గ్రంథాలయాల పాత్ర కూడా పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు గ్రంథాలయాలు పుస్తకాలు, పత్రికలు, పరిశోధన గ్రంథాలను సేకరించి భద్రపరచే సంస్థలుగా మాత్రమే ఉండేవి. కానీ నేడు అవి పరిశోధనా వ్యవస్థలో కీలక భాగస్వాములుగా మారాయి.
ఆధునిక విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు పరిశోధకులకు పరిశోధన దత్తాంశ నిర్వహణ, సంస్థాగత డిజిటల్ నిల్వలు, ఉటంకింపు నిర్వహణ, స్వేచ్ఛా ప్రాప్యత ప్రచురణ, పరిశోధన దృశ్యమానత పెంపు, పరిశోధకుల డిజిటల్ గుర్తింపు నిర్వహణ, పరిశోధన ప్రభావ నివేదికల తయారీ వంటి అనేక సేవలను అందిస్తున్నాయి.
ప్రపంచంలోని హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, స్టాన్‌ఫోర్డ్, మసాచుసెట్స్ సాంకేతిక విద్యాసంస్థ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ప్రత్యేక పరిశోధన సహాయ సేవల విభాగాలు ఏర్పాటు చేసి పరిశోధకులకు ప్రచురణ వ్యూహాలు, సరైన పత్రికల ఎంపిక, ఉటంకింపు విశ్లేషణ, దత్తాంశ నిర్వహణ, స్వేచ్ఛా ప్రాప్యత ప్రచురణ, మేధోసంపత్తి హక్కులు, పరిశోధన ప్రభావ విశ్లేషణ వంటి సేవలను అందిస్తున్నాయి.
ఈ కారణంగా ఆధునిక గ్రంథపాలకుడు కేవలం సమాచార సంరక్షకుడు మాత్రమే కాదు . పరిశోధన సలహాదారుడు, దత్తాంశ నిర్వాహకుడు, పరిశోధన ప్రభావ విశ్లేషకుడు, విద్యా భాగస్వామిగా కూడా మారుతున్నాడు.

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది. ఎక్కువ ఉటంకింపులు (సైటేషన్) పొందిన ప్రతి పరిశోధన నిజంగా అత్యుత్తమ పరిశోధనగానే పరిగణించాలా? దీనికి సమాధానం ప్రతిసారీ "అవును" "కాదు" . కొన్ని పరిశోధనలు అత్యంత నాణ్యమైనవైనా? అవి ప్రత్యేక రంగానికి మాత్రమే పరిమితం కావడం వల్ల తక్కువ ఉటంకింపులు పొందవచ్చు. మరోవైపు, వివాదాస్పదమైన లేదా లోపభూయిష్టమైన పరిశోధనలు విమర్శల కారణంగా కూడా ఎక్కువసార్లు ఉటంకించబడే అవకాశం ఉంటుంది. అందువల్ల ఉటంకింపుల సంఖ్య ఒక్కటే పరిశోధన నాణ్యతకు అంతిమ ప్రమాణం కాదని ప్రపంచవ్యాప్తంగా అంగీకరించబడుతోంది.

ఈ నేపథ్యంలో బాధ్యతాయుత పరిశోధన మూల్యాంకనం అనే భావనకు విశేష ప్రాధాన్యం లభిస్తోంది. ఇందులో పరిశోధన యొక్క నూతనత్వం (కొత్త విషయం,లేదా అనుసరించిన పద్ధతి), శాస్త్రీయ నాణ్యత, సమాజంపై ప్రభావం, అంతరశాఖ సహకారం, స్వేచ్ఛా విజ్ఞానానికి చేసిన కృషి, పరిశోధన దత్తాంశాన్ని పంచుకోవడం, ప్రజా విధానాలపై చూపిన ప్రభావం వంటి అనేక అంశాలను సమగ్రంగా పరిశీలిస్తారు. ఒకే సంఖ్యతో పరిశోధకుడిని లేదా పరిశోధనను తీర్పు చేయకుండా, సమగ్ర దృక్కోణంతో మూల్యాంకనం చేయడమే ఈ విధానం ప్రధాన లక్ష్యం.

**భారత దేశంలో పరిస్థితులు:**
భారతదేశంలో కూడా జాతీయ విద్యా విధానం-2020 అమలులోకి వచ్చిన తరువాత పరిశోధన నాణ్యత, అంతర్జాతీయ దృశ్యమానత, ప్రపంచ స్థాయి ప్రచురణలు, పరిశోధన సహకారంపై ప్రత్యేక దృష్టి పెరిగింది. ఈ మార్పుల నేపథ్యంలో విశ్వవిద్యాలయ గ్రంథాలయాల బాధ్యతలు కూడా విస్తరించాయి. పరిశోధకులకు సరైన సమాచార వనరులను అందించడం మాత్రమే కాకుండా, విశ్వసనీయ పత్రికలను గుర్తించడం, నకిలీ ప్రచురణల నుండి రక్షించడం, ఉటంకింపు నిర్వహణలో శిక్షణ ఇవ్వడం, పరిశోధన ప్రభావాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం వంటి బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ విధంగా ఆధునిక గ్రంథాలయం జ్ఞానాన్ని భద్రపరిచే స్థావరం నుంచి జ్ఞాన ప్రభావాన్ని కొలిచే, విశ్లేషించే, ప్రపంచానికి చేర్చే వ్యూహాత్మక విద్యా కేంద్రంగా పరిణామం చెందింది. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, స్వయంచాలక విశ్లేషణ వ్యవస్థలు, పరిశోధన దత్తాంశ విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ గ్రంథాలయాల పాత్ర మరింత విస్తరించనుంది.

**ఉటంకింపు సూచికలు: పరిశోధన నాణ్యతకు ప్రమాణాలా? లేక పరిమిత కొలమానాలా?**
ఉటంకింపు విశ్లేషణ (సిటేషన్ అనాలిసిస్ - సి.ఏ.): కాలక్రమేణా ఈ విశ్లేషణకు అనేక ప్రమాణాలు అభివృద్ధి చెందాయి. అయితే ఇవి పరిశోధన నాణ్యతను పూర్తిగా ప్రతిబింబిస్తాయా? అనే ప్రశ్న ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉంది.

**హెచ్-ఇండెక్స్ (హెచ్.ఐ.):**
అత్యంత విస్తృతంగా ఉపయోగించే సూచికలలో హెచ్‌ఇండెక్స్ (హెచ్.ఐ.) ఒకటి. 2005లో భౌతిక శాస్త్రవేత్త జార్జ్ ఈ. హిర్ష్ దీనిని ప్రతిపాదించారు. ఒక పరిశోధకుడి కనీసం 'హెచ్' సంఖ్యలో పరిశోధనా వ్యాసాలు ఒక్కొక్కటి కనీసం 'హెచ్' సార్లు ఉటంకించబడితే, ఆ పరిశోధకుడి హెచ్‌ఇండెక్స్ అదే సంఖ్యగా పరిగణించబడుతుంది. ఉదాహరణకు ఒక పరిశోధకుడికి 25 హెచ్‌ఇండెక్స్ ఉంటే, ఆయన ప్రచురించిన కనీసం 25 పరిశోధనా వ్యాసాలు ఒక్కొక్కటి కనీసం 25 సార్లు ఉటంకించబడ్డాయని అర్థం. ఈ సూచిక పరిశోధకుడి ఉత్పాదకతతో పాటు, పరిశోధన ప్రభావాన్ని కూడా ఒకే ప్రమాణంలో ప్రతిబింబించే ప్రయత్నం చేస్తుంది. అందువల్ల ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు అధ్యాపకుల నియామకాలు, పదోన్నతులు, పరిశోధన నిధుల మంజూరు వంటి అంశాల్లో హెచ్‌ఇండెక్స్‌ను పరిశీలిస్తున్నాయి.
అయితే దీనికి పరిమితులు కూడా ఉన్నాయి. కొత్తగా పరిశోధన ప్రారంభించిన ప్రతిభావంతులైన పరిశోధకులకు తక్కువ హెచ్‌ఇండెక్స్ ఉండటం సహజం. అలాగే వేర్వేరు శాస్త్ర విభాగాల్లో ఉటంకింపుల సాంద్రత భిన్నంగా ఉంటుంది. జీవశాస్త్రాల్లో సాధారణంగా ఎక్కువ ఉటంకింపులు వస్తే, మానవీయ శాస్త్రాల్లో తక్కువగా ఉంటాయి. కాబట్టి అన్ని రంగాలకు ఒకే హెచ్‌ఇండెక్స్ ప్రమాణాన్ని వర్తింపజేయడం శాస్త్రీయంగా సరైన పద్ధతి కాదు.

**ఐ–10 సూచిక (ఐ–10 ఇండెక్స్ – ఐ.10.ఐ.):**
గూగుల్ స్కాలర్ ప్రవేశపెట్టిన ఈ సూచిక చాలా సరళమైనది. కనీసం పది సార్లు ఉటంకించబడిన పరిశోధనా వ్యాసాల సంఖ్యనే ఐ10 సూచికగా పరిగణిస్తారు. ఇది ముఖ్యంగా వ్యక్తిగత పరిశోధకుల ప్రభావాన్ని త్వరగా అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది.
అయితే ఇది ప్రపంచవ్యాప్తంగా అన్ని సంస్థలు అంగీకరించిన ప్రమాణం (స్టాండర్డ్ ప్రక్రియ) కాదు. ప్రధానంగా గూగుల్ స్కాలర్ వేదికలో మాత్రమే ఎక్కువగా ఉపయోగించబడుతోంది.

**పత్రిక ప్రభావ కారకం**
**(జర్నల్ ఇంపాక్ట్ ఫ్యాక్టర్ – జె.ఐ.ఎఫ్.):**
ఒక పరిశోధనా పత్రిక నాణ్యతను అంచనా వేయడానికి అత్యంత ప్రసిద్ధమైన సూచిక పత్రిక ప్రభావ కారకం (జె.ఐ.ఎఫ్.). ఇది ఒక నిర్దిష్ట కాలంలో ఆ పత్రికలో ప్రచురితమైన వ్యాసాలను ఇతర పరిశోధకులు సగటున ఎన్ని సార్లు ఉటంకించారో సూచిస్తుంది. ఉదాహరణకు, ఒక పత్రికకు ప్రభావ కారకం 12 ఉంటే, ఆ పత్రికలో ఇటీవల ప్రచురితమైన ప్రతి వ్యాసం సగటున పన్నెండు సార్లు ఉటంకించబడిందని అర్థం. అయితే ఒక పెద్ద అపోహ ఏమిటంటే, అధిక ప్రభావ కారకం ఉన్న పత్రికలో ప్రచురితమైన ప్రతి వ్యాసం అత్యుత్తమమనే భావన. వాస్తవానికి అదే పత్రికలో కొన్ని వ్యాసాలు వేలాది ఉటంకింపులు పొందుతుంటే, మరికొన్ని వ్యాసాలు చాలా తక్కువ ఉటంకింపులతోనే మిగిలిపోతాయి. కాబట్టి పత్రిక ప్రభావ కారకాన్ని వ్యక్తిగత పరిశోధకుడి నాణ్యతకు ప్రమాణంగా ఉపయోగించడం సరైన పద్ధతి కాదని అనేక అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**సైట్‌స్కోర్ (సి.ఎస్.)**
స్కోపస్ సమాచార వ్యవస్థ అభివృద్ధి చేసిన మరో ముఖ్యమైన సూచిక సైట్‌స్కోర్ (సి.ఎస్.). ఇది నాలుగు సంవత్సరాల వ్యవధిలో ప్రచురితమైన వ్యాసాల సగటు ఉటంకింపుల ఆధారంగా లెక్కించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా వేలాది పరిశోధనా పత్రికలను పోల్చడానికి ఈ సూచిక ఉపయోగపడుతోంది. ముఖ్యంగా విజ్ఞానశాస్త్రం, వైద్యశాస్త్రం, సాంకేతిక విద్య రంగాల్లో దీనికి అధిక ప్రాధాన్యం ఉంది.

**ఎస్‌సి ఐమాగో పత్రిక శ్రేణి (ఎస్‌సి.ఐ.మాగో జర్నల్ ర్యాంక్ – ఎస్.జె.ఆర్.)**
ఈ సూచిక సాధారణ ఉటంకింపుల సంఖ్యను మాత్రమే పరిగణనలోకి తీసుకోదు. ఎవరు ఉటంకించారు? అనే అంశాన్నీ పరిశీలిస్తుంది. అంటే అత్యున్నత నాణ్యత కలిగిన పత్రికల నుంచి వచ్చిన ఉటంకింపులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది.

దీని వల్ల పరిశోధన ప్రభావాన్ని మరింత సమతుల్యంగా అంచనా వేయవచ్చని భావిస్తారు. అందుకే అనేక విశ్వవిద్యాలయాలు పత్రిక ఎంపికలో ఎస్.జె.ఆర్.ను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

**మూలానికి సాధారణీకరించిన ప్రభావం (సోర్స్ నార్మలైజ్డ్ ఇంపాక్ట్ పర్ పేపర్ – ఎస్.ఎన్.ఐ.పీ.)**
వివిధ శాస్త్ర విభాగాల్లో ఉటంకింపుల స్వభావం వేర్వేరుగా ఉంటుంది. జీవశాస్త్రాల్లో ఒక వ్యా

> **ఇరవయ్యొకటవ శతాబ్దంలో ఉన్నత విద్య, విజ్ఞాన సృష్టి, సాంకేతిక ఆవిష్కరణలు, ప్రజా విధానాల రూపకల్పన వంటి ప్రతి రంగంలో పరిశోధనకు అపారమైన ప్రాధాన్యం ఏర్పడింది. అయితే పరిశోధన విజయాన్ని కేవలం ఎన్ని పరిశోధనా వ్యాసాలు ప్రచురించబడ్డాయనే సంఖ్యతో మాత్రమే కొలవడం నేటి ప్రపంచంలో సరిపోదు. ఒక పరిశోధన కొత్త జ్ఞానాన్ని ఎంత మేరకు సృష్టించింది? ఇతర పరిశోధకులు దానిని ఎంతగా వినియోగించారు? ప్రభుత్వ విధానాలపై, పరిశ్రమలపై, విద్యా వ్యవస్థపై, సమాజంపై ఎంత ప్రభావం చూపింది? వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించే విధానాన్నే పరిశోధన ప్రభావ మూల్యాంకనం (ఆర్.ఐ.ఏ.) అని పిలుస్తారు.**

సానికి వందలాది ఉటంకింపులు రావడం సాధారణమైతే, చరిత్ర లేదా తత్వశాస్త్రంలో పది లేదా ఇరవై ఉటంకింపులే గొప్పవిగా పరిగణించబడవచ్చు.

ఈ వ్యత్యాసాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించిందే ఎస్.ఎన్.ఐ.పి.. ఇది ప్రతి శాస్త్ర విభాగంలోని సహజ ఉటంకింపు విధానాన్ని పరిగణనలోకి తీసుకుని పత్రిక ప్రభావాన్ని అంచనా వేస్తుంది.

**ఉటంకింపు సూచికలపై విమర్శలు:**

ఉటంకింపు సూచికలు పరిశోధన మూల్యాంకనంలో ఉపయోగకరమైనవే అయినప్పటికీ, వాటిని ఏకైక ప్రమాణంగా ఉపయోగించడం అనేక సమస్యలకు దారితీస్తోంది. మొదటిగా, స్వీయ ఉటంకింపులు ద్వారా కొంతమంది పరిశోధకులు తమ సూచికలను కృత్రిమంగా పెంచుకునే అవకాశం ఉంది. రెండవది, ఒకే రంగానికి చెందిన పరిశోధకులు పరస్పరం ఒకరి వ్యాసాలను మరొకరు ఉటంకించుకోవడం ద్వారా సూచికలను ప్రభావితం చేయగలరు. మూడవది, సంఖ్యల ఆధారంగా పరిశోధనను అంచనా వేయడం వల్ల పరిశోధన నాణ్యత కంటే ఉటంకింపులు పెంచుకోవడంపైనే దృష్టి కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, మానవీయ శాస్త్రాలు, ప్రాంతీయ భాషా పరిశోధనలు, స్థానిక సామాజిక సమస్యలపై జరిగే పరిశోధనలు అంతర్జాతీయ ఉటంకింపులు తక్కువగా పొందినా, వాటి సామాజిక విలువ ఎంతో గొప్పగా ఉండవచ్చు. కాబట్టి కేవలం ఉటంకింపు సూచికల ఆధారంగా వాటి నాణ్యతను తక్కువగా అంచనా వేయడం శాస్త్రీయంగా, నైతికంగా సరైన విధానం కాదు.

ఈ నేపథ్యంలో ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధన నిధుల సంస్థలు ఉటంకింపు సూచికలను సహాయక ప్రమాణాలుగా మాత్రమే ఉపయోగించాలని, తుది నిర్ణయానికి పరిశోధన నాణ్యత, నూతనత్వం, సామాజిక ప్రభావం, పరిశోధన నైతికత వంటి అంశాలను కూడా సమానంగా పరిగణించాలని సూచిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ ప్రభావ ఉటంకింపు సూచికలు, స్వేచ్ఛా విజ్ఞానం, డిజిటల్ పరిశోధన ప్రభావం, అలాగే బాధ్యతాయుత పరిశోధన మూల్యాంకనం

**గ్రంథాలయాల భవిష్యత్ వ్యూహాత్మక పాత్ర:**

పరిశోధన ప్రభావాన్ని కొలవడానికి దశాబ్దాలుగా ఉటంకింపు ఆధారిత సూచికలు ప్రధాన ప్రమాణాలుగా కొనసాగుతున్నప్పటికీ, డిజిటల్ యుగంలో పరిశోధన వ్యాప్తి స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఒక పరిశోధనా వ్యాసం శాస్త్రీయ పత్రికలో ప్రచురితమైన తర్వాత మాత్రమే ప్రభావం చూపడం లేదు. ప్రచురణ జరిగిన కొద్ది గంటల్లోనే ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ వేదికల ద్వారా వేలాది మంది దానిని చదువుతున్నారు, చర్చిస్తున్నారు, విధాన రూపకర్తలు ఉపయోగిస్తున్నారు, వార్తా సంస్థలు ప్రస్తావిస్తున్నాయి. ఈ కొత్త పరిస్థితుల్లో సాంప్రదాయ ఉటంకింపు సూచికలు మాత్రమే పరిశోధన ప్రభావాన్ని పూర్తిగా ప్రతిబింబించలేవనే అభిప్రాయం బలపడింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రభావ సూచికలు (ఆల్ట్‌మెట్రిక్స్ - ఏ.ఎం.) అనే భావన అభివృద్ధి చెందింది. సంప్రదాయ ఉటంకింపులకు భిన్నంగా, ఒక పరిశోధన డిజిటల్ ప్రపంచంలో ఎంత మేర చర్చకు వచ్చింది, ఎంతమంది దానిని వీక్షించారు, డౌన్‌లోడ్ చేసుకున్నారు, వార్తా కథనాల్లో ప్రస్తావించారు, ప్రభుత్వ విధాన పత్రాల్లో ఉపయోగించారు, విద్యా వేదికల్లో పంచుకున్నారు వంటి అంశాలను ఈ విధానం పరిశీలిస్తుంది.

ప్రత్యామ్నాయ ప్రభావ సూచికలు పరిశోధన యొక్క తక్షణ ప్రభావాన్ని అంచనా వేయగలవు. సంప్రదాయ ఉటంకింపులు పెరగడానికి కొన్నిసార్లు రెండు నుంచి ఐదు సంవత్సరాల సమయం పట్టవచ్చు. కానీ డిజిటల్ ప్రభావం ప్రచురణ జరిగిన వెంటనే కనిపించడం ప్రారంభమవుతుంది. ప్రజారోగ్యం, అంటువ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పు వంటి అత్యవసర రంగాల్లో ఈ విధమైన తక్షణ ప్రభావ విశ్లేషణ విధాన రూపకర్తలకు ఎంతో ఉపయోగపడుతోంది.

అయితే ప్రత్యామ్నాయ ప్రభావ సూచికలకు కూడా పరిమితులు ఉన్నాయి. ఒక పరిశోధన సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు రావడం వల్ల దాని శాస్త్రీయ నాణ్యత అత్యుత్తమమని నిర్ధారించలేము. కొన్నిసార్లు వివాదాస్పద అంశాలు కూడా ఎక్కువ ప్రచారం పొందుతాయి. అందువల్ల ఈ సూచికలను పరిశోధన నాణ్యతకు ప్రత్యామ్నాయంగా కాకుండా, అదనపు సమాచార వనరుగా మాత్రమే ఉపయోగించాలని ప్రపంచ నిపుణులు సూచిస్తున్నారు.

**స్వేచ్ఛా విజ్ఞానం (ఓపెన్ సైన్స్ – ఓ.ఎస్.) మరియు పరిశోధన ప్రభావం**

ఇటీవలి కాలంలో ప్రపంచ ఉన్నత విద్యా వ్యవస్థలో అత్యంత ప్రభావవంతమైన భావన స్వేచ్ఛా విజ్ఞానం (ఓపెన్ సైన్స్ - ఓ.ఎస్.). దీని ప్రధాన ఉద్దేశ్యం పరిశోధన ఫలితాలు, పరిశోధన దత్తాంశం, పద్ధతులు, సాఫ్ట్‌వేర్, శాస్త్రీయ చర్చలను వీలైనంత వరకు అందరికీ అందుబాటులో ఉంచడం.

ఈ విధానం వల్ల పరిశోధన పారదర్శకత పెరగడంతో పాటు, ఇతర పరిశోధకులు అదే దత్తాంశాన్ని మళ్లీ విశ్లేషించే అవకాశం లభిస్తుంది. ఫలితంగా పరిశోధన నాణ్యత మెరుగుపడటమే కాకుండా, అంతర్జాతీయ సహకారం కూడా పెరుగుతుంది. అనేక అధ్యయనాలు స్వేచ్ఛా ప్రాప్యతలో ప్రచురితమైన పరిశోధనలకు సాధారణంగా ఎక్కువ ఉటంకింపులు లభించే అవకాశముందని సూచిస్తున్నాయి.

**స్వేచ్ఛా ప్రాప్యత (ఓపెన్ యాక్సెస్ – ఓ.ఏ.) మరియు సంస్థాగత డిజిటల్ నిల్వలు**

స్వేచ్ఛా విజ్ఞానం విజయవంతం కావడానికి స్వేచ్ఛా ప్రాప్యత (ఓపెన్ యాక్సెస్ - ఓ.ఏ.) కీలకమైన అంశం. చందా చెల్లించలేని పరిశోధకులు, విద్యార్థులు, అభివృద్ధి చెందుతున్న దేశాల విద్యాసంస్థలు కూడా నాణ్యమైన పరిశోధనను ఉచితంగా చదవగలగడం ద్వారా ప్రపంచ విజ్ఞాన అసమానతలు తగ్గే అవకాశం ఉంటుంది.

ఈ లక్ష్యాన్ని సాధించడంలో విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు సంస్థాగత డిజిటల్ నిల్వలను ఏర్పాటు చేస్తున్నాయి. అధ్యాపకులు, పరిశోధకులు ప్రచురించిన వ్యాసాలు, సిద్ధాంత గ్రంథాలు, పరిశోధన దత్తాంశం, సమావేశ పత్రాలు వంటి మేధోసంపత్తిని డిజిటల్ రూపంలో భద్రపరచి ప్రపంచానికి అందుబాటులో ఉంచుతున్నాయి. దీనివల్ల ఆయా విశ్వవిద్యాలయాల అంతర్జాతీయ గుర్తింపు కూడా పెరుగుతోంది.

**పరిశోధన దత్తాంశ నిర్వహణలో గ్రంథాలయాల పాత్ర**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలో అత్యంత విలువైన వనరు పరిశోధన దత్తాంశం. గతంలో పరిశోధనా వ్యాసం మాత్రమే ప్రచురించబడేది. ఇప్పుడు దానితో పాటు అసలు దత్తాంశాన్ని కూడా భద్రపరచి, అవసరమైతే ఇతర పరిశోధకులతో పంచుకోవాలని ప్రముఖ నిధుల సంస్థలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రంథాలయాలు పరిశోధన దత్తాంశ నిర్వహణ ప్రణాళికలు, దత్తాంశ భద్రత, దీర్ఘకాలిక డిజిటల్ సంరక్షణ, పునర్వినియోగం, ప్రమాణీకరణ వంటి సేవలను అందిస్తున్నాయి. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఈ సేవలు ఇప్పుడు గ్రంథాలయాల ప్రధాన బాధ్యతల్లో ఒకటిగా మారాయి.

**పరిశోధకుల డిజిటల్ గుర్తింపు నిర్వహణ:**

ప్రపంచవ్యాప్తంగా ఒకే పేరుతో అనేక మంది పరిశోధకులు ఉండడం వల్ల పరిశోధన గుర్తింపులో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి ప్రతి పరిశోధకుడికి ప్రత్యేక డిజిటల్ గుర్తింపు సంఖ్యను కేటాయించే వ్యవస్థలు అమలులోకి వచ్చాయి. ఈ డిజిటల్ గుర్తింపులను నిర్వహించడం, పరిశోధకుల ప్రచురణలను సరైన వ్యక్తికి అనుసంధానం చేయడం, వారి పరిశోధన ప్రభావాన్ని విశ్లేషించడం వంటి సేవల్లో కూడా ఆధునిక గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**కృత్రిమ మేధస్సు ప్రభావం:**

కృత్రిమ మేధస్సు (ఏ.ఐ.) అభివృద్ధి చెందుతున్న కొద్దీ పరిశోధన ప్రభావ విశ్లేషణ కూడా కొత్త దశలోకి ప్రవేశిస్తోంది. లక్షలాది పరిశోధనా వ్యాసాలను క్షణాల్లో విశ్లేషించడం, పరిశోధన ధోరణులను గుర్తించడం, భవిష్యత్ పరిశోధన రంగాలను అంచనా వేయడం, అసాధారణ ఉటంకింపు విధానాలను గుర్తించడం,నకిలీ ప్రచురణలను గుర్తించడం వంటి అనేక పనులను ఇప్పుడు కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలు నిర్వహిస్తున్నాయి.అయితే ఈ సాంకేతికతను ఉపయోగించేటప్పుడు పారదర్శకత, వ్యక్తిగత గోప్యత, అల్గోరిథమ్ పక్షపాతం, దత్తాంశ భద్రత వంటి అంశాలపై కూడా సమాన శ్రద్ధ అవసరం.

**విమర్శనాత్మక విశ్లేషణ:**

పరిశోధన ప్రభావాన్ని కొలవడానికి నేడు అనేక ప్రమాణాలు అందుబాటులో ఉన్నప్పటికీ, ఒక్క ప్రమాణం కూడా సంపూర్ణమైనది కాదు. ఉటంకింపు సూచికలు పరిశోధన విద్యా ప్రభావాన్ని తెలియజేస్తాయి. ప్రత్యామ్నాయ ప్రభావ సూచికలు సామాజిక, డిజిటల్ ప్రభావాన్ని తెలియజేస్తాయి. స్వేచ్ఛా విజ్ఞానం పరిశోధన అందుబాటును పెంచుతుంది. కృత్రిమ మేధస్సు విశ్లేషణను వేగవంతం చేస్తుంది. కానీ ఈ అన్ని అంశాలను సమగ్రంగా కలిపి పరిశీలించినప్పుడే ఒక పరిశోధన యొక్క నిజమైన విలువను అంచనా వేయడం సాధ్యమవుతుంది. అందువల్ల ఆధునిక గ్రంథాలయాల లక్ష్యం కేవలం పరిశోధనను భద్రపరచడం కాదు. పరిశోధనను ప్రపంచానికి చేరవేయడం, దాని ప్రభావాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం, పరిశోధకులకు సరైన మార్గనిర్దేశం చేయడం, బాధ్యతాయుత పరిశోధన సంస్కృతిని పెంపొందించడం కూడా కావాలి. ఇదే ఇరవయ్యొకటవ శతాబ్దపు గ్రంథాలయాల వ్యూహాత్మక పరిణామానికి మూలాధారం.

**హార్వర్డ్–ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల ఉత్తమ పద్ధతులు, భారతీయ విశ్వవిద్యాలయాలకు సవాళ్లు,**

**భవిష్యత్ దిశ :**

పరిశోధన నాణ్యతను పెంపొందించడంలో ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు అనుసరిస్తున్న విధానాలు నేడు ఇతర ఉన్నత విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా హార్వర్డ్ విశ్వవిద్యాలయం, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, మసాచుసెట్స్ సాంకేతిక విద్యాసంస్థ, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం వంటి సంస్థలు పరిశోధన ప్రభావాన్ని కేవలం సంఖ్యల ఆధారంగా కాకుండా, సమగ్ర నాణ్యత ఆధారంగా అంచనా వేసే విధానాలను అభివృద్ధి చేశాయి.

ఈ విశ్వవిద్యాలయాల గ్రంథాలయాల్లో పరిశోధన సహాయ కేంద్రాలు ప్రత్యేక విభాగాలుగా పనిచేస్తాయి. పరిశోధన అంశం ఎంపిక నుంచి ప్రచురణ వరకు, ప్రచురణ నుంచి పరిశోధన ప్రభావ విశ్లేషణ వరకు ప్రతి దశలో పరిశోధకులకు మార్గనిర్దేశం అందిస్తాయి. పరిశోధన దత్తాంశ నిర్వహణ, ఉటంకింపు నిర్వహణ, రచయితల హక్కులు, స్వేచ్ఛా ప్రాప్యత ప్రచురణ, పరిశోధన దృశ్యమానత, అంతర్జాతీయ సహకార పరిశోధన, డిజిటల్ పరిశోధన గుర్తింపు వంటి సేవలు ఈ కేంద్రాల ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.

ఈ విశ్వవిద్యాలయాలు ఒక ముఖ్యమైన సూత్రాన్ని అనుసరిస్తున్నాయి. పరిశోధకుడిని పత్రిక ప్రభావ కారకం లేదా హెచ్-ఇండెక్స్ వంటి ఒకే సూచికతో అంచనా వేయకూడదు. బదులుగా పరిశోధన నూతనత, సామాజిక ప్రయోజనం, విధాన రూపకల్పనపై ప్రభావం, అంతరశాఖ సహకారం, విద్యార్థులపై ప్రభావం, దత్తాంశ పంచుకోవడం, పరిశోధన నైతికత వంటి అనేక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలిస్తాయి. ఈ విధానం ప్రపంచవ్యాప్తంగా బాధ్యతాయుత పరిశోధన మూల్యాంకనంగా గుర్తింపు పొందింది.

**పరిశోధన మూల్యాంకనంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు:**

గత దశాబ్దంలో పరిశోధన మూల్యాంకన విధానంలో ప్రపంచవ్యాప్తంగా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అధిక ఉటంకింపులున్న పత్రికల్లో ప్రచురించడం మాత్రమే పరిశోధన నాణ్యతకు ప్రమాణం కాదని అనేక అంతర్జాతీయ సంస్థలు స్పష్టంగా ప్రకటించాయి. అందువల్ల ప్రస్తుతం పరిశోధనను సమాజంపై చూపిన ప్రభావం, ప్రభుత్వ విధానాల్లో వినియోగం, పారిశ్రామిక రంగంలో అనువర్తనం, ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పు వంటి అంశాల ఆధారంగా కూడా మూల్యాంకనం చేస్తున్నారు.

ఈ మార్పు గ్రంథాలయాల బాధ్యతలను మరింత విస్తరించింది. గ్రంథపాలకుడు ఇప్పుడు సమాచార సంరక్షకుడు మాత్రమే కాదు; పరిశోధన వ్యూహకర్త, పరిశోధన దత్తాంశ నిపుణుడు, ప్రచురణ సలహాదారు, పరిశోధన ప్రభావ విశ్లేషకుడు, డిజిటల్ విజ్ఞాన నిర్వాహకుడిగా మారుతున్నాడు.

**భారతీయ విశ్వవిద్యాలయాల పరిస్థితి:**

భారతదేశంలో పరిశోధన నాణ్యత గత రెండు దశాబ్దాల్లో గణనీయంగా పెరిగినప్పటికీ, పరిశోధన ప్రభావ మూల్యాంకన వ్యవస్థ ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మొదటిగా, అనేక విద్యాసంస్థల్లో పరిశోధన మూల్యాంకనం ఇప్పటికీ ప్రచురణల సంఖ్య ఆధారంగానే జరుగుతోంది. దీనివల్ల కొన్నిసార్లు నాణ్యత కంటే సంఖ్యకు ప్రాధాన్యం పెరుగుతోంది.రెండవది, నకిలీ లేదా నాసిరకం పరిశోధన పత్రికల్లో ప్రచురణలు జరగడం పరిశోధన విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. మూడవది, అనేక విశ్వవిద్యాలయాల్లో పరిశోధన దత్తాంశ నిర్వహణ, సంస్థాగత డిజిటల్ నిల్వలు, స్వేచ్ఛా ప్రాప్యత విధానాలు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదు.

నాలుగవది, పరిశోధన ప్రభావాన్ని కొలిచే గ్రంథపాలకుల నైపుణ్యాభివృద్ధికి తగిన శిక్షణ కార్యక్రమాలు ఇంకా అన్ని విద్యాసంస్థల్లో అందుబాటులో లేవు. అయితే ఇటీవలి కాలంలో పరిస్థితి క్రమంగా మారుతోంది. జాతీయ విద్యా విధానం–2020, జాతీయ పరిశోధన ప్రోత్సాహక కార్యక్రమాలు, డిజిటల్ గ్రంథాలయాల అభివృద్ధి, స్వేచ్ఛా ప్రాప్యత ఉద్యమం, పరిశోధన నైతికతపై పెరుగుతున్న అవగాహన వంటి అంశాలు భారతీయ ఉన్నత విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయి.

**భవిష్యత్ గ్రంథాలయాల దిశ:**

రాబోయే కాలంలో గ్రంథాలయాల పాత్ర మరింత సాంకేతికత ఆధారితంగా మారనుంది. కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, పెద్ద దత్తాంశ విశ్లేషణ, విజ్ఞాన గ్రాఫ్‌లు, స్వయంచాలక ఉటంకింపు విశ్లేషణ, పరిశోధన ధోరణుల అంచనా వంటి సాంకేతికతలు పరిశోధన సేవల్లో భాగమవుతాయి. భవిష్యత్తులో ఒక గ్రంథాలయం కేవలం సమాచారాన్ని అందించే స్థలం కాకుండా, పరిశోధన రూపకల్పన, దత్తాంశ నిర్వహణ, ప్రచురణ వ్యూహం, ప్రభావ విశ్లేషణ, అంతర్జాతీయ సహకారం, పరిశోధన నైతికత వంటి అన్ని అంశాల్లో పరిశోధకుడికి సమగ్ర మద్దతు అందించే పరిశోధన జ్ఞాన కేంద్రంగా రూపాంతరం చెందుతుంది.

**విమర్శనాత్మక సమీక్ష:**

పరిశోధన ప్రభావ మూల్యాంకనంలో ఒక ముఖ్యమైన ప్రమాదం ఏమిటంటే, సంఖ్యలను లక్ష్యంగా మార్చుకోవడం. ఉటంకింపులు పెంచుకోవడం కోసం స్వీయ ఉటంకింపులు, పరస్పర ఉటంకింపులు, నాణ్యతలేని ప్రచురణలు పెరిగితే పరిశోధన యొక్క అసలు ఉద్దేశ్యం దెబ్బతింటుంది. అందువల్ల ప్రతి విద్యాసంస్థ సంఖ్యల కంటే నాణ్యతకు, పత్రికల కంటే పరిశోధనకు, ప్రచురణల కంటే ప్రజాప్రయోజనానికి, పోటీ కంటే బాధ్యతాయుత విజ్ఞాన సృష్టికి ప్రాధాన్యం ఇవ్వాలి.

ఈ దిశలో గ్రంథాలయాల పాత్ర అత్యంత కీలకం. సరైన సమాచార వనరులను ఎంపిక చేయడం, పరిశోధకులకు శిక్షణ ఇవ్వడం, పరిశోధన నైతికతను ప్రోత్సహించడం, నాణ్యమైన ప్రచురణలను గుర్తించడం, పరిశోధన ప్రభావాన్ని సమగ్రంగా విశ్లేషించడం వంటి బాధ్యతలను గ్రంథాలయాలు సమర్థంగా నిర్వహించినప్పుడే ఉన్నత విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుంది.

**సమగ్ర ముగింపు:**

ఇరవయ్యొకటవ శతాబ్దంలో పరిశోధన ప్రభావ మూల్యాంకనం అనేది కేవలం ఉటంకింపుల లెక్కింపు కాదు; అది విజ్ఞాన నాణ్యత, సామాజిక ప్రయోజనం, శాస్త్రీయ విశ్వసనీయత, ప్రజా విధానాలపై ప్రభావం, ఆర్థికాభివృద్ధికి చేసిన కృషి, మానవ సంక్షేమానికి అందించిన సేవలను సమగ్రంగా అంచనా వేసే ప్రక్రియ. ఈ మారుతున్న ప్రపంచంలో గ్రంథాలయాలు తమ సంప్రదాయ పాత్రను దాటి, పరిశోధన పర్యావరణ వ్యవస్థలో వ్యూహాత్మక భాగస్వాములుగా ఎదుగుతున్నాయి. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాల అనుభవం ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది. నాణ్యమైన గ్రంథాలయం లేకుండా నాణ్యమైన పరిశోధన సాధ్యం కాదు; నాణ్యమైన పరిశోధన లేకుండా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయం నిర్మాణం సాధ్యం కాదు. భారతీయ విశ్వవిద్యాలయాలు కూడా ఈ దిశగా గ్రంథాలయాలను కేవలం పుస్తకాల నిల్వ కేంద్రాలుగా కాకుండా, పరిశోధన ప్రభావాన్ని నిర్మించే, కొలిచే, ప్రపంచానికి పరిచయం చేసే జ్ఞాన మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

GUEST COLUMN

# గద్దరన్న – పీడిత ప్రజల గొంతుక, తెలంగాణ చైతన్యానికి శాశ్వత ప్రతీక

## విప్లవ పోరాటాల నుంచి భారత రాజ్యాంగం వరకు ఒక మహాప్రయాణం"

**గద్దర్ అన్న గారితో నా పరిచయం తెలంగాణ మలిదశ ఉద్యమం (Second Phase Telangana Movement) ద్వారానే మరింత ప్రత్యక్షంగా, మరింత సన్నిహితంగా జరిగింది. అయితే అంతకంటే ముందే విద్యార్థి ఉద్యమాల కాలం నుంచే గద్దర్ అన్న పాటలంటే, ఆయన సాహిత్యమంటే (Literature) నాకు ఎంతో అభిమానం ఉండేది. ఆయన గొంతులో ఉన్న ఆవేదన, ఆయన పాటల్లో ఉన్న ప్రజల బాధ, అన్యాయంపై (Injustice) ఆయన ఎత్తిన స్వరం నన్ను ఎప్పుడూ ఆకర్షించేది.**

**ప్రజాకవి కాళోజి నారాయణరావు గారు చెప్పిన " అన్యాయాన్ని ఎదిరించే వాడే నాకు ఆరాధ్యుడు" అనే భావజాలమే (Ideology) నా ఆలోచనలకు పునాది.**

**చదువుకున్నప్పటి నుంచే పీడిత ప్రజలు సమాన హక్కులతో (Equal Rights), గౌరవంగా జీవించే సమాజం నిర్మించాలనే ఆకాంక్ష నాలో ఉంది. నాకు ఇప్పటివరకు ఏ పార్టీతోటి సంబంధం లేదు, అందుకే ఏ పార్టీ అనే భేదం లేకుండా ప్రజల హక్కుల కోసం, పీడితుల పక్షాన నిలబడి పోరాడే ప్రతి ఒక్కరినీ నేను గౌరవిస్తాను.**



- రేపల్లె నరోత్తమ సూరి.
అధ్యక్షుడు
Be Human Forum – Telangana State
మొబైల్: 9908925139

ఆ ఆలోచనల కారణంగానే గద్దరన్న పట్ల నాకు ఎనలేని గౌరవం ఏర్పడింది. ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే స్పందించి, బాధితుల పక్షాన నిలబడి, గొంతులేని వారికి గొంతుకగా (Voice of the Voiceless) మారిన ప్రజాకవి గద్దరన్న వ్యక్తిత్వం నాకు ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంది. అందుకే ఆయనపై నాకు అప్పటినుంచి ఇప్పటివరకు ప్రత్యేకమైన అభిమానం, గౌరవం ఉన్నాయి.

గద్దర్ అన్న కేవలం ఒక గాయకుడు కాదు. అన్యాయాన్ని ప్రశ్నించిన ఒక గొంతు. అణగారిన ప్రజల బాధను తన పాటగా మలిచిన ఒక ప్రజా కవి (People's Poet). పేదల కన్నీటిని, రైతుల ఆవేదనను, దళితుల అవమానాన్ని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని (SelfRespect) తన గానంలో ప్రతిబింబించిన ఒక ఉద్యమ స్వరం.

అప్పటి పీపుల్స్ వార్ ఉద్యమ నాయకుడు కామ్రేడ్ కొండపల్లి సీతారామయ్య గారు రచించిన "వ్యవసాయ విప్లవం" అనే పత్రాన్ని పూర్తిగా అధ్యయనం (Study) చేసి, దానిలోని భావాలను (Ideas) ఒక పాట రూపంలో ప్రజల ముందుకు తీసుకువచ్చిన ఘనత గద్దర్ అన్నది.

ఆ కాలంలో మేము ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులం. అప్పటికే విద్యార్థుల్లో సామాజిక చైతన్యం (Social Awareness) పెరుగుతున్న కాలం. గద్దర్ అన్న రాసిన ఆ పాట కేవలం ఒక గేయం (Song) కాదు; వ్యవసాయ వ్యవస్థలోని వైరుధ్యాలను (Contradictions), పేద రైతు జీవితంలోని బాధలను, దేశంలోని ఆర్థిక అసమానతలను (Economic Inequalities) ప్రజల ముందుకు తీసుకొచ్చిన ఒక సామాజిక పత్రం (Social Document).

ఆ పాట విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లింది. గ్రామాల్లో, విద్యార్థుల్లో, ఉద్యమకారుల్లో అది ఒక ఆలోచనకు (Thought) కారణమైంది.

గద్దర్ అన్న ఆ పాటలో భారతదేశ సంపదను (Wealth), అదే సమయంలో ప్రజల దారిద్ర్యాన్ని (Poverty) ప్రశ్నిస్తూ ఇలా రాశారు——

భారతదేశం భాగ్యసీమరాబతుకు వంతలో కొదవలేదురాబంగారు పంటల భూములున్నవిచావు ఎరుగని జీవనదులురాఅంగట్లోన అన్నీ ఉన్న యిఅల్లుడు నోట్లో శని ఉన్నట్టుసకల సంపదగల ఈ దేశంలోదరిద్రం ఎట్లుందో నాయనాదరిద్రం ఎట్లుందో నాయనా

ఈ పాటలో గద్దర్ అన్న ఒక గొప్ప ప్రశ్నను (Great Question) సమాజం ముందుకు తీసుకొచ్చారు.

సహజ సంపదలు (Natural Resources) ఉన్న దేశం. వ్యవసాయ భూములు ఉన్న దేశం. నదులు, ప్రకృతి వనరులు (Natural Resources) ఉన్న దేశం. అయినా కోట్లాది ప్రజలు ఎందుకు ఆకలితో, పేదరికంతో జీవించాల్సి వస్తోంది?

**ఈ ప్రశ్న గద్దర్ అన్న జీవితాంతం వెంటాడిన ప్రశ్న.**

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, దేశంలో అసమానతలు (Inequalities) పూర్తిగా తొలగిపోలేదనే ఆవేదన ఆయన పాటల్లో కనిపిస్తుంది. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం (Concentration of Wealth) కావడం, కష్టపడే ప్రజలకు సరైన జీవన భద్రత (Livelihood Security) లేకపోవడం, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన సాహిత్యంలో (Literature) ప్రధాన అంశాలుగా నిలిచాయి. ఇప్పటికీ ఆ పాటలోని ప్రశ్నలు మన సమాజం ముందు నిలిచే ఉన్నాయి. అభివృద్ధి (Development) జరుగుతున్నప్పటికీ ఆ అభివృద్ధి ఫలాలు చివరి మనిషికి చేరుతున్నాయా? అన్న ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

గద్దర్ అన్న గొప్పతనం ఏమిటంటే —— ఆయన క్లిష్టమైన రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాలను (Political and Economic Theories) పుస్తకాల భాషలో కాకుండా, పల్లె ప్రజలకు అర్థమయ్యే పాటల భాషలో అందించారు. అందుకే ఆయన పాటలు ఒక కాలానికి పరిమితం కాలేదు. అవి ప్రతి తరానికి (Every Generation) ఒక ప్రశ్నగా, ఒక చైతన్యంగా (Consciousness) నిలిచాయి.

గద్దర్ అన్న సాహిత్యం (Literature) మనకు నేర్పేది ఒక్కటే —— సమాజంలో అన్యాయం (Injustice) ఉన్నంతకాలం ప్రశ్నించే గొంతు (Voice of Questioning) అవసరం ఉంటుంది. ఆ గొంతే గద్దర్.

గద్దర్ అన్నతో నాకు ప్రత్యక్ష పరిచయం ఏర్పడిన సందర్భం తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రలో ఒక కీలకమైన ఘట్టంతో ముడిపడి ఉంది.

1997లో భువనగిరిలో గద్దర్ అన్న ఆధ్వర్యంలో నిర్వహించిన చారిత్రాత్మక తెలంగాణ సభ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర (Separate Telangana State) ఆకాంక్ష ఎంత బలంగా ప్రజల్లో ఉందో దేశానికి చాటిచెప్పిన మహాసభగా నిలిచింది. అదే సమయంలో శ్రీ గాదె ఇన్నయ్య గారు రచించిన " దగాపడ్డ తెలంగాణ (Betrayed Telangana)" పుస్తకం ఉద్యమానికి ఒక ఆలోచనా పునాదిగా నిలిచింది.

ఆ సభ ఏర్పాట్ల సందర్భంగా హైదరాబాద్‌లోని ఆల్వాల్‌లో గద్దర్ అన్న నివాసానికి రెండు మూడు సార్లు వెళ్లి, ఆయనను భువనగిరి సభకు తీసుకురావాల్సిన బాధ్యతను నేను స్వయంగా నిర్వహించే అవకాశం నాకు లభించింది. ఆ సందర్భంలో ఆయనతో నాకు ఆత్మీయ పరిచయం ఏర్పడింది.

ఆ సభకు ముందు మూడు రోజుల పాటు జరిగిన సెషన్ సమావేశాల్లో ఒక సెషన్‌కు నేను అధ్యక్షత వహించే అవకాశం రావడం నా జీవితంలో మరచిపోలేని ఘట్టం. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభ ఏర్పాట్లలో కూడా నేను బాధ్యతలు నిర్వహిస్తూ చురుకుగా పాల్గొన్నాను. గాదె ఇన్నయ్య గారు, పాశం యాదగిరి గారు, ఎస్. మల్లారెడ్డి గారు, జైని మల్లయ్య గుప్తా గారు, బెల్లి కృష్ణ గారు, బెల్లి లలిత అక్కతో పాటు అనేక మంది ఉద్యమ నాయకులు ఈ సభను విజయవంతం చేశారు. కాళోజీ నారాయణరావు గారు, ప్రొఫెసర్ జయశంకర్ గారు, కామ్రేడ్ కే.జీ. సత్యమూర్తి గారు, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు కూడా ఈ చారిత్రాత్మక సభలో పాల్గొన్నారు.

ఈ మూడు రోజుల సెషన్ సమావేశాలు, బహిరంగ సభతో కూడిన భువనగిరి తెలంగాణ సభ విజయవంతం కావడానికి కృషి చేసిన ఉద్యమకారులతో పాటు నేనూ నా వంతు బాధ్యతలను నిర్వర్తిస్తూ అన్ని కార్యక్రమాల్లో భాగస్వామి కావడం నా జీవితంలో ఎంతో సంతృప్తిని, తెలంగాణ ఉద్యమంలో నేనూ ఒక చిన్న పాత్ర పోషించాననే గర్వాన్ని ఇచ్చిన మరపురాని జ్ఞాపకం.

మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో నేను తెలంగాణ ఆకాంక్ష వేదిక రాష్ట్ర కన్వీనర్‌గా ఉన్నప్పుడు వరంగల్‌లో గద్దర్ అన్న పాదయాత్రను ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఆ సమయంలో అప్పటి వరంగల్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర గారు గద్దర్ వరంగల్‌కు వస్తే కాల్చి పడేస్తామని హెచ్చరికలు చేసిన పరిస్థితులు కూడా ఉన్నాయి. అయినా తెలంగాణ ఆకాంక్షతో నిండిన ఆ ఉద్యమ కాలంలో మేము వెనుకడుగు వేయలేదు. గద్దర్ అన్నను వరంగల్‌కు తీసుకువచ్చి, ఆయన పాదయాత్రను విజయవంతం చేయాలని సంకల్పించాము. ప్రాణాలకు సైతం వెరవకుండా మూడు రోజుల పాటు ఆ పాదయాత్రను నిర్వహించాము.

ఆ పాదయాత్ర మొదటి రోజు గద్దర్ అన్నను పాదయాత్రలో భాగంగా మార్గమధ్యంలో మా ఇంటికి తీసుకువెళ్లి మధ్యాహ్న విశ్రాంతి కల్పించడం, చుట్టూ పోలీసుల పహారీలో ఉద్యమకారులందరికీ మా ఇంటి వద్ద భోజన ఏర్పాట్లు చేయడం, అక్కడి నుంచి తిరిగి పాదయాత్ర కొనసాగించడం —— ఇవన్నీ నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతులు.

ఈ వ్యక్తిగత అనుబంధం ద్వారా నేను గద్దర్ అన్నను కేవలం ఒక ప్రజా గాయకుడిగా కాదు, ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహోన్నతమైన చైతన్యంగా అర్థం చేసుకున్నాను. గద్దర్ అన్న ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయన జీవితంలోని మూడు ప్రధాన కోణాలను పరిశీలించాలి —— విప్లవం, కుల ప్రశ్న, రాజ్యాంగ ప్రజాస్వామ్యం. ఈ మూడు అంశాల చుట్టూనే ఆయన ఆలోచనా పరిణామం, ప్రజా పోరాటం, పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన ఆయన మహా ప్రయాణం కొనసాగింది.

ప్రజా గేయకారుడిగా గద్దర్ - ఒక పాటలో ఒక సిద్ధాంతం

గద్దర్ అన్న గారి సాహిత్య ప్రయాణాన్ని పరిశీలిస్తే, ఆయన కేవలం ప్రజల బాధలను పాటలుగా రాసిన కవి మాత్రమే కాదు; సమాజాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ప్రజలకు అర్థమయ్యే భాషలో ఒక సిద్ధాంతాన్ని పాట రూపంలో అందించిన ప్రజా మేధావి అని అర్థమవుతుంది.

*విప్లవ పోరాటాల (Revolutionary Struggles) నుంచి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష (Aspiration for Telangana State) వరకు

-* గద్దర్ అన్న పాటలతో రగిలిన ఉద్యమ చైతన్యం (Movement Consciousness) తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రలో భువనగిరి సభ ఒక కీలకమైన మలుపు (Turning Point). తెలంగాణ ప్రాంత ప్రజలలో పేరుకుపోయిన అసంతృప్తి, అన్యాయం, వెనుకబాటుతనం, ఆత్మగౌరవ ఆకాంక్షలను ఒక సమగ్ర ఉద్యమ రూపంలోకి (Comprehensive Movement Form) తీసుకురావాల్సిన అవసరాన్ని గద్దర్ అన్న చాలా ముందుగానే గుర్తించారు. అందుకే తెలంగాణ అనే భావనను కేవలం రాజకీయ నినాదంగా కాకుండా, ప్రజల జీవన అనుభవంగా, వారి బాధగా, వారి చరిత్రగా పాటల రూపంలో ప్రజల ముందుకు తీసుకొ

చ్చారు.

ఆ కాలంలో భువనగిరి సభను కేంద్రంగా చేసుకొని గద్దర్ అన్న రాసిన పాటలు తెలంగాణ ఉద్యమానికి ఒక సాంస్కృతిక ఆయుధంగా (Cultural Weapon) మారాయి. ఆ సభకు ప్రత్యక్ష సాక్షులుగా, ఆ ఉద్యమ వాతావరణంలో భాగస్వాములుగా (Participants) ఉన్న మాకు ఆ పాటల ప్రభావం ఎంత గొప్పదో ప్రత్యక్షంగా అనుభవించగలిగిన అవకాశం వచ్చింది.

అందులో ముఖ్యంగా రెండు పాటలు తెలంగాణ ఉద్యమ చైతన్యానికి చిరస్థాయిగా (Permanent) నిలిచిపోయాయి.

"దగాపడ్డ నా తెలంగాణ గుండె చప్పుడు వినరో మా అన్నలారా"

తెలంగాణ ఆవేదనకు ప్రతిరూపం (Symbol of Telangana Pain)

తెలంగాణ ప్రజల అనుభవించిన వివక్షను, వెనుకబాటుతనాన్ని, వారి బాధను గద్దర్ అన్న ఈ పాటలో అత్యంత హృదయ విదారకంగా వ్యక్తీకరించారు.

తెలంగాణ ఒక ప్రాంతం మాత్రమే కాదు, ఎన్నో తరాల కష్టం, చెమట, కన్నీళ్లతో నిర్మితమైన ఒక జీవన సంస్కృతి (Living Culture) అని ఆయన పాట ద్వారా చెప్పారు.

ఈ పాటలోని భావం ఏమిటంటే —— సంపదలు ఉన్నా, వనరులు ఉన్నా, కష్టపడే ప్రజలు ఉన్నా, ఆ ఫలాలు తెలంగాణ ప్రజలకు ఎందుకు అందలేదు అనే ప్రశ్న.

"దగాపడ్డ తెలంగాణ" అనే పదమే ఒక చారిత్రక అనుభవానికి ప్రతీక (Symbol of Historical Experience) గా మారింది.

అది కేవలం ఒక నినాదం కాదు; ప్రజల మనసుల్లో ఉన్న అసంతృప్తికి ఒక స్వరం.

"అమ్మా తెలంగాణమా... ఆకలి కేకల గానమా..."

తెలంగాణకు ఒక గుండె చప్పుడు (Heartbeat of Telangana)

గద్దర్ అన్న రాసిన మరో గొప్ప పాట "అమ్మా తెలంగాణమా..." తెలంగాణ ఉద్యమానికి ఒక భావోద్వేగ గీతంగా (Emotional Song) నిలిచింది.

ఈ పాటలో తెలంగాణను ఒక తల్లిగా సంబోధిస్తూ, ఆ తల్లి ఎదుర్కొన్న బాధలను, ఆకలి కేకలను, దోపిడీని, ప్రజల గాయాలను ఆయన ఆవిష్కరించారు.

ఈ పాట విన్న ప్రతి తెలంగాణ బిడ్డలో ఒక ఆత్మగౌరవ భావన (SelfRespect Feeling) కలిగేది. అది కేవలం ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కాదు; తమ చరిత్రకు, తమ సంస్కృతికి, తమ హక్కులకు గుర్తింపు కావాలనే ఆకాంక్ష.

గద్దర్ అన్న గొప్పతనం ఏమిటంటే, ఆయన రాజకీయ అంశాలను (Political Issues) కూడా సామాన్య ప్రజలకు అర్థమయ్యే భావోద్వేగ భాషలో చెప్పగలిగారు. అందుకే ఆయన పాటలు సభలకే పరిమితం కాకుండా పల్లెల్లోకి, విద్యార్థుల మధ్యకు, ఉద్యమ శిబిరాల్లోకి వెళ్లాయి.

తెలంగాణ కోసం ఎదుర్కొన్న నిర్బంధాలు (Restrictions Faced for Telangana)

తెలంగాణ ఉద్యమానికి గద్దర్ అన్న అందించిన మద్దతు అప్పటి పాలకులకు కూడా ఇబ్బందికరంగా మారింది. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను బలంగా వినిపిస్తున్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తెలంగాణ ఉద్యమాల పట్ల అనుకూలంగా వ్యవహరించలేదనే విమర్శలు వచ్చాయి.

గద్దర్ అన్నపై జరిగిన కాల్పుల ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ ఘటన ఆయన జీవితంలో ఒక విషాదకరమైన మలుపు (Tragic Turning Point). అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు.

తనపై జరిగిన దాడి తర్వాత కూడా ప్రజల కోసం తన గళాన్ని ఆపలేదు. తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన మరింత దృఢంగా ముందుకు సాగారు.

ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన గద్దర్ అన్న

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దర్ అన్న చేయని ప్రయత్నం లేదు. ఆయన పాల్గొనని కార్యక్రమం లేదు. సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజా సమావేశాలు —— ప్రతి వేదికపై తెలంగాణ ప్రజల ఆకాంక్షను తన పాటతో, తన మాటతో వినిపించారు.

ఆయనకు తెలంగాణ అంటే కేవలం ఒక రాజకీయ డిమాండ్ (Political Demand) కాదు. అది ఒక ప్రజల గౌరవం, ఒక చారిత్రక న్యాయం, ఒక ఆత్మగౌరవ పోరాటం.

మలిదశ ఉద్యమంలో గద్దర్ అన్న పాత్రను కేవలం ఒక కళాకారుడిగా చూడటం సరిపోదు. ఆయన ఒక సాంస్కృతిక యోధుడు (Cultural Warrior). ఆయన పాటలు ఉద్యమానికి శక్తినిచ్చాయి. ఆయన గళం ప్రజల ఆకాంక్షలకు ప్రతిధ్వనిగా (Echo) నిలిచింది.

భువనగిరి సభ (Bhongir Meeting) నుంచి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం (Formation of Telangana State) వరకు సాగిన ఈ ప్రయాణంలో గద్దర్ అన్న పాటలు ఒక తరాన్ని కదిలించాయి. తెలంగాణ చరిత్రలో ఆయన పేరు ఒక ప్రజా చైతన్య ప్రతీకగా (Symbol of People's Consciousness) ఎప్పటికీ నిలిచిపోతుంది.

"పొడుస్తున్న పొద్దుమీద...నడుస్తున్న కాలమా...పోరు తెలంగాణమా..." కోట్లాది ప్రాణమా - తెలంగాణ ఉద్యమానికి ఊపిరిచ్చిన గద్దరన్న గానం (Song)

గద్దరన్న తెలంగాణను కేవలం ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ (Separate State Demand) గా చూడలేదు. ఆయన దృష్టిలో తెలంగాణ అంటే ప్రజల ఆత్మగౌరవం (SelfRespect), సామాజిక న్యాయం (Social Justice), పీడిత వర్గాల గౌరవప్రదమైన జీవితం. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు సమానత్వంతో (Equality) కూడిన సామాజిక తెలంగాణ నిర్మాణమే ఆయన కల.

ఆ దృక్పథంతోనే ఆయన రాసిన "పొడుస్తున్న పొద్దుమీద...నడుస్తున్న కాలమా...పోరు తెలంగాణమా..." పాట తెలంగాణ మలిదశ ఉద్యమానికి చైతన్య గీతంగా (Awareness Song) మారింది. చీకట్లను చీల్చుకుని కొత్త ఉదయం వైపు సాగాలని, ప్రజల హక్కుల (People's Rights) కోసం ఐక్యంగా పోరాడాలని ఈ గీతం పిలుపునిచ్చింది.

ఈ పాట విద్యార్థులు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. సభల్లో, ర్యాలీల్లో (Rallies), ఉద్యమ కార్యక్రమాల్లో ఈ పాట వినిపించిన ప్రతిసారీ అది కేవలం గానం కాదు; తెలంగాణ ప్రజల సామూహిక గొంతుకగా మారి పోరాట స్ఫూర్తిని నింపింది.

ప్రజల మనసులోని బాధను, ఆశను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని పాటగా మలచడంలో గద్దరన్నకు ఉన్న అసాధారణ ప్రతిభ (Extraordinary Talent) ఈ గీతంలో స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే "పొడుస్తున్న పొద్దుమీద..." కేవలం ఒక ఉద్యమ గీతం కాదు; తెలంగాణ చైతన్యానికి చిరస్థాయి ప్రతీకగా (Permanent Symbol), ఒక తరం ప్రజలను మేల్కొలిపిన అమర గీతంగా చరిత్రలో నిలిచిపోయింది.

నీళ్ల ప్రశ్నను ప్రజల పాటగా మార్చిన గద్దర్ అన్న - గంగమ్మ, కృష్ణమ్మల గాథ

తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని అర్థం చేసుకోవాలంటే కేవలం రాజకీయ డిమాండ్లను (Political Demands) మాత్రమే కాదు, ఈ నేల ప్రజల జీవన సమస్యలను కూడా అర్థం చేసుకోవాలి. అందులో ముఖ్యమైన అంశం నీటి ప్రశ్న.

తెలంగాణ ప్రాంతం గుండా రెండు మహానదులు —— కృష్ణా, గోదావరి —— ప్రవహిస్తున్నప్పటికీ, తమ పొలాలకు, తమ పంటలకు ఆ నదుల నీరు సమృద్ధిగా అందడం లేదనే ఆవేదన తెలంగాణ రైతాంగంలో చాలాకాలంగా ఉంది. ఈ బాధను, ఈ వైరుధ్యాన్ని గద్దర్ అన్న ప్రజల భాషలో, ప్రజల పాటగా మార్చారు.

ఆయన రాసిన గంగమ్మ పాటలో ఒక ప్రాంతపు నీటి తపన మాత్రమే కాదు, తరతరాలుగా రైతు ఎదుర్కొన్న ఆవేదన వినిపిస్తుంది.

గంగమ్మ గంగమ్మా...అకోల్... ఘనమైన గంగాకోల్...నాసికలో పుట్టి కోల్నడక నేర్చింది కోల్...

అంటూ గోదావరి నది, కృష్ణానది, ప్రయాణాన్ని పాటలో చిత్రిస్తూ, నది గొప్పతనాన్ని చెబుతూనే, ఆ నది ప్రవహించే నేలల ప్రజలకు నీటి న్యాయం (Water Justice) ఎందుకు దక్కడం లేదనే ప్రశ్నను గద్దర్ అన్న ముందుకు తెచ్చారు.

అలాగే కృష్ణానది (Krishna River) విషయంలో కూడా ఆయన పాటల్లో ఒక ఆవేదన కనిపిస్తుంది. కృష్ణమ్మ తెలంగాణ నేల మీదుగా ప్రవహిస్తూ కూడా తెలంగాణ రైతు పొలాలకు తగినంత నీరు అందడం లేదనే భావనను ఆయన ప్రజల ముందు ఉంచారు.

ఈ పాటల ప్రత్యేకత ఏమిటంటే —— అవి గణాంకాల భాషలో (Language of Statistics) మాట్లాడలేదు. అవి రైతు గుండె భాషలో మాట్లాడాయి.

ఒక రైతు తన పొలం ఎండిపోతుంటే అనుభవించే బాధను, నది తన కళ్ల ముందే ప్రవహిస్తున్నా తన పొలానికి నీరు రాకపోతే కలిగే ఆవేదనను గద్దర్ అన్న పాటగా మలిచారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాలు ప్రధాన చర్చగా (Main Discussion) మారాయి. అందులో నీటి ప్రశ్నను ప్రజల మనసుల్లోకి తీసుకెళ్లడంలో గద్దర్ అన్న పాటలు కీలక పాత్ర (Key Role) పోషించాయి.

తెలంగాణ ఉద్యమ భావజాలంలో (Ideology) ఉన్న ప్రాంతీయ అసమానతలు, వనరుల పంపిణీ (Distribution of Resources) పై ఉన్న అసంతృప్తిని ఆయన తన పాటల ద్వారా వ్యక్తం చేశారు. ముఖ్యంగా సాగునీటి విషయంలో తమకు అన్యాయం జరిగిందనే తెలంగాణ ప్రజల భావనను ఆయన బలమైన ప్రజా గీతాలుగా (People's Songs) మలిచారు.

గద్దర్ అన్న గొప్పతనం ఏమిటంటే —— క్లిష్టమైన రాజకీయ అంశాలను (Political Issues) కూడా ఆయన పల్లె ప్రజలకు అర్థమయ్యేలా చెప్పగలిగారు. నది, నేల, రైతు, పంట అనే సాధారణ పదాల ద్వారా ఒక పెద్ద సామాజిక ప్రశ్నను (Social Question) ప్రజల ముందుకు తెచ్చారు.

అందుకే గద్దర్ అన్న తెలంగాణ పాటలు కేవలం ఉద్యమ గీతాలు కావు. అవి ఒక ప్రాంతపు చరిత్రను, ఒక ప్రజల బాధను, ఒక తరం ఆకాంక్షలను నమోదు చేసిన ప్రజా సాహిత్యం (People's Literature).

తెలంగాణ నేలపై నీటి హక్కు (Right to Water) కోసం వినిపించిన ఆ గొంతులో, ప్రతి రైతు కన్నీటి చుక్క ప్రతిధ్వనించింది. అదే గద్దర్ అన్న పాటల మహత్తు.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో గద్దర్ అన్న - ప్రజల ప్రతి పోరాటానికి ఒక సాంస్కృతిక శక్తి (Cultural Force)

తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రను రాసేటప్పుడు గద్దర్ అన్న పాత్రను ప్రత్యేకంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన కేవలం ఒక కళాకారుడిగా, ఒక గాయకుడిగా ఉద్యమంలో పాల్గొనలేదు. ఆయన తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ఒక సాంస్కృతిక ప్రతినిధిగా (Cultural Representative), ఒక ఉద్యమ స్ఫూర్తిగా నిలిచారు.

తెలంగాణ ఉద్యమం ఏ ఒక్క వర్గానికో, ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా సకల జనుల ఉద్యమంగా (Movement of All Sections of People) మారడంలో గద్దర్ అన్న పాటలు, ఆయన ప్రసంగాలు, ఆయన ప్రజా సంబంధాలు (Public Relations) ఒక గొప్ప పాత్ర పోషించాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉద్యమంలో ముందుండి పోరాడుతున్న సమయంలో గద్దర్ అన్న వారిలో ధైర్యాన్ని, నమ్మకాన్ని నింపారు. విద్యార్థుల ఆత్మగౌరవ పోరాటానికి (SelfRespect Struggle) తన గళంతో అండగా నిలిచారు.

అలాగే కార్మికులు, కర్షకులు, సింగరేణి బొగ్గు గని కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, రైతులు, సామాన్య ప్రజలు —— ఎక్కడ తెలంగాణ ఆకాంక్ష కోసం ఉద్యమం జరిగితే అక్కడ గద్దర్ అన్న తన ఉనికిని చాటుకున్నారు.

ప్రత్యేకంగా సకల జనుల సమ్మె (General Strike of All Sections) సమయంలో ఆయన ప్రజల్లోకి వెళ్లి, తన పాటలతో, తన మాటలతో ఉద్యమానికి మరింత ఉత్సాహాన్ని (Enthusiasm) అందించారు.

ఆయన గొప్పతనం ఏమిటంటే —— ఆరోగ్యం సహకరించని పరిస్థితుల్లో కూడా ప్రజల కోసం ప్రయాణించడం ఆపలేదు. శరీరం అలసిపోయినా, గొంతు బలహీనమైనా, తెలంగాణ ప్రజల ఆకాంక్ష (Aspiration) కోసం ఆయన వేదికలపై నిలబడ్డారు.

వేలాది సభల్లో పాల్గొని, తన పాట ద్వారా, తన ప్రసంగం (Speech) ద్వారా, తన సామాజిక అవగాహన (Social Awareness) ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల ఉద్యమంగా మలిచారు.

గద్దర్ అన్నకు తెలంగాణ అంటే కేవలం ఒక రాజకీయ నినాదం (Political Slogan) కాదు. అది ఒక ప్రజల ఆత్మగౌరవం (Self Respect). అందుకే ఆయన ఉద్యమాన్ని కేవలం రాష్ట్ర సాధనతో పరిమితం చేయలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సామాజిక న్యాయం (Social Justice), పేద ప్రజల అభివృద్ధి (Development of Poor People), అణగారిన వర్గాల హక్కుల (Rights of Oppressed Sections) గురించి నిరంతరం మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేక మంది తమ తమ స్థాయిలో పాత్ర పోషించారు. ఆ మహా ఉద్యమంలో గద్దర్ అన్న పాత్ర మాత్రం ప్రత్యేకమైనది. ఎందుకంటే ఆయన రాజకీయ నాయకుడిగా కాకుండా, ప్రజల మధ్య నుంచి వచ్చిన సాంస్కృతిక యోధుడిగా (Cultural Warrior) ఉద్యమానికి ఊపిరి అందించారు.

**తెలంగాణ ప్రజల హృదయాల్లో ఆయన స్థానం అందుకే ప్రత్యేకం.**

తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రలో గద్దర్ అన్న చేసిన కృషి, ఆయన అందించిన స్ఫూర్తి (Inspiration), ఆయన అంకితభావం (Dedication) —— ఇవన్నీ తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేని ఒక చారిత్రక అధ్యాయం (Historic Chapter).

**ఉద్యమానికి నైతిక కాపలాదారుగా (Moral Guardian) గద్దర్ అన్న**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో గద్దర్ అన్న పాత్రను కేవలం పాటలు పాడిన ఒక సాంస్కృతిక కార్యకర్తగా (Cultural Activist) మాత్రమే చూడలేం. ఆయన ఉద్యమానికి ఒక నైతిక దిక్సూచిగా (Moral Guide), ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా నిలిచారు.

ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్న రాజకీయ శక్తులు (Political Forces) ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడు, అది తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, ఉద్యమ లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని ఆయన భావిస్తే, ఎలాంటి సంకోచం లేకుండా తన నిరసనను వ్యక్తం చేసేవారు.

ఆయన నిరసనలో వ్యక్తిగత విమర్శ (Personal Criticism) ఉండేది కాదు; తెలంగాణ ప్రజల ప్రయోజనాల పట్ల ఉన్న బాధ్యత (Responsibility) ఉండేది. అందుకే ఆయన మాటను ఉద్యమకారులు కూడా గౌరవంగా పరిగణించేవారు.

గద్దర్ అన్న ఒక ప్రత్యేక తెలంగాణను మాత్రమే కాదు, అసమానతలు లేని (Without Inequalities), సామాజిక న్యాయం ఉన్న, ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కే ఒక సామాజిక తెలంగాణను కలలు కన్నారు.

అందుకే తెలంగాణ ఉద్యమంలో ఆయన ఒక దీపస్తంభంలా (Beacon of Light) నిలిచారు. ఉద్యమం దారి తప్పకుండా ప్రజల ఆకాంక్షల వైపు నడవాలని గుర్తు చేసే ఒక పెద్ద గొంతుకగా ఉన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో గద్దర్ అన్న పాత్రను గుర్తు చేసుకునేటప్పుడు, ఆయన పాటలను మాత్రమే కాదు, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించిన ఆయన ధైర్యాన్ని (Courage) కూడా తప్పకుండా స్మరించుకోవాలి.

ఇప్పటివరకు గద్దరన్న తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటం, పీడిత ప్రజల పక్షాన సాగించిన ఉద్యమం, సమాజానికి అందించిన స్ఫూర్తిదాయకమైన సేవల (Inspirational Services) గురించి మనం చర్చించుకున్నాం. అయితే, ఇప్పుడు గద్దరన్న తన భౌతిక దేహాన్ని విడిచి వెళ్లే ముందు ఈ సమాజానికి, ఈ దేశ ప్రజలకు, ముఖ్యంగా భావితరాలకు అందించిన గొప్ప సందేశాన్ని (Great Message) మనం చర్చించుకోవాల్సిన అవసరం ఉంది.

అది కేవలం ఒక వ్యక్తి చివరి సందేశం కాదు; సమానత్వం (Equality), రాజ్యాంగ పరిరక్షణ (Protection of Constitution), సామాజిక న్యాయం (Social Justice), మానవత్వం (Humanity) కోసం ఆయన మనందరికీ అందించిన జీవిత సందేశం (Life Message).
ఆ సందేశం వెనుక ఉన్న నేపథ్యం ఏమిటి? దాని ఆవశ్యకత ఏమిటి? నేటి సమాజానికి అది ఎందుకు మార్గదర్శకంగా (Guiding Principle) నిలుస్తుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.

గద్దర్ - విప్లవం (Revolution) నుంచి రాజ్యాంగ మార్గం (Constitutional Path) వరకు పీడిత ప్రజల విముక్తి (Liberation of Oppressed People) కోసం సాగిన మహా ప్రయాణం.

**"బండెనక బండి కట్టి... పదహారు బండ్లు కట్టి..."**

ఈ పాట వినిపిస్తే తెలుగు నేలలో ప్రతి పీడిత హృదయం ఒక్కసారిగా ఉప్పొంగుతుంది. అది కేవలం ఒక గేయం కాదు, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి (SelfRespect) ప్రతీక. ఆ గొంతు గద్దర్‌ది. ఆ స్వరం ఒక వ్యక్తిదే కాదు, కోట్లాది ప్రజల ఆకాంక్షలకు (Aspirations) ప్రతిధ్వని (Echo).

గద్దర్ అంటే ఒక వ్యక్తి కాదు - ఒక చైతన్యం (Consciousness). ఒక ఉద్యమం (Movement). ఒక ప్రశ్న. ఒక ప్రతిఘటన (Resistance). తెలంగాణలోనే కాదు, యావత్ భారతదేశంలో ఎక్కడ అన్యాయం జరిగినా "గద్దర్ వస్తే మన మాట వినిపిస్తుంది" అనే విశ్వాసాన్ని ప్రజల్లో నింపిన ప్రజాకవి (People's Poet).

విప్లవం - తుపాకీ ద్వారా సమసమాజం (Equal Society) సాధ్యమనే నమ్మకం

యువకుడిగా గద్దర్ నక్సలైట్ ఉద్యమాన్ని ఆశ్రయించారు. సమాజంలో పెరిగిపోతున్న అసమానతలు (Inequalities), దోపిడీ, భూస్వామ్య వ్యవస్థ, అవినీతిని చూస్తూ, హింసాత్మక రాజ్యాన్ని ఎదుర్కోవాలంటే సాయుధ పోరాటం (Armed Struggle) మాత్రమే మార్గమని అప్పటి విప్లవ ఉద్యమం విశ్వసించింది. ఆ నమ్మకంతో అడవుల బాట పట్టారు. అజ్ఞాత జీవితం గడిపారు. ప్రజా యుద్ధాన్ని తమ జీవిత లక్ష్యంగా స్వీకరించారు.

వర్గపోరాటం (Class Struggle) సరిపోదు - కులాన్ని (Caste) కూడా అర్థం చేసుకోవాలి

గద్దర్ జీవితంలో అత్యంత ముఖ్యమైన సిద్ధాంతపరమైన (Ideological) మలుపు ఇదే. మార్క్సిస్టు ఉద్యమం (Marxist Movement) ప్రధానంగా వర్గపోరాటాన్ని ముందుకు తెచ్చినా, భారతదేశ వాస్తవికతలో కులవ్యవస్థ (Caste System) కూడా సమానంగా ప్రజల జీవితాలను నిర్ణయిస్తోందని గద్దర్ స్పష్టంగా వాదించారు.

"భారతదేశంలో కేవలం వర్గ దోపిడీ గురించే మాట్లాడటం సరిపోదు. కుల దోపిడీని కూడా అర్థం చేసుకుని, దానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి" అనే ప్రశ్నను ఆయన నక్సలైట్ ఉద్యమం లోనే లేవనెత్తారు.

ఆ చర్చలకు తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో ఆయన ఆ ఉద్యమం నుంచి బయటకు వచ్చారు. అది వ్యక్తిగత విభేదం కాదు; భారత సమాజాన్ని మరింత సమగ్రంగా (Comprehensively) అర్థం చేసుకోవాలనే సిద్ధాంతపరమైన ప్రయత్నం.

**ప్రజాకవిగా ప్రజాస్వామ్య ఉద్యమాలకు (Democratic Movements) అండ**

పార్టీని విడిచినా ప్రజలను మాత్రం ఎప్పుడూ విడిచిపెట్టలేదు. తన గళాన్ని ప్రజలకు అంకితం చేశారు. దళితులు, ఆదివాసీలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు——ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ గద్దర్ పాట వినిపించింది.

**విప్లవం నుంచి రాజ్యాంగం (Constitution) వైపు**

గద్దర్ జీవితంలోని చివరి దశ అత్యంత లోతైన రాజకీయ పరిణామాన్ని (Political Evolution) సూచిస్తుంది.

సాయుధ పోరాటం ద్వారా సమసమాజం సాధ్యమనే నమ్మకంతో ప్రారంభమైన ఆయన ప్రయాణం, చివరికి ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థలో (Democratic Constitutional System)నే పీడిత ప్రజల విముక్తికి అవకాశాలు వెతికే దిశగా మారింది.

రాజ్య హింసను ఆయన తీవ్రంగా విమర్శించారు. కానీ దానికి ప్రత్యామ్నాయంగా ప్రజల ఓటు (People's Vote) అనే ఆయుధాన్ని కూడా అంతే శక్తివంతమైన సాధనంగా చూశారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను (Constitutional Rights) కాపాడుకుంటూ, ఎన్నికల్లో పాల్గొని అధికారాన్ని సాధించి, పీడిత ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచనను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.

అందుకే చివరి దశలో ఆయన "లాల్ -నీల్ ఐక్యత" (RedBlue Unity) ను పిలుపునిచ్చారు. మార్క్సిస్టు వర్గపోరాటం (ఎరుపు) మరియు అంబేద్కర్ సామాజిక న్యాయం (నీలం) కలిస్తేనే భారతదేశంలో నిజమైన ప్రజాస్వామ్యం (True Democracy) బలపడుతుందని విశ్వసించారు.

**గద్దర్‌ను ఎలా అర్థం చేసుకోవాలి?**

సోదరులారా... గద్దరన్నను కేవలం విప్లవకారుడిగా (Revolutionary) చూస్తే అది పూర్తి అవగాహన (Complete Understanding) కాదు. కేవలం ప్రజాగాయకుడిగా (Folk Singer) చూస్తే అది కూడా సరిపోదు. కేవలం తెలంగాణ ఉద్యమ నాయకుడిగా చెప్పినా గద్దరన్నను పూర్తిగా అర్థం చేసుకోలేం. గద్దరన్న అంటే ప్రజల విముక్తి (People's Liberation) కోసం తన జీవితాన్నంతా అంకితం చేసిన మహా చైతన్య జ్యోతి (Great Flame of Consciousness).

ఈ దేశంలోని రాజకీయాలను (Politics) చూశాడు... పాలకుల కుట్రలను (Conspiracies of Rulers) చూశాడు... పీడిత ప్రజల కన్నీళ్లను చూశాడు... ఎన్నో సిద్ధాంతాలను (Ideologies) అధ్యయనం చేశాడు... మార్క్స్‌ను చదివాడు... అంబేద్కర్‌ను అర్థం చేసుకున్నాడు... చివరకు తన అనుభవాలన్నింటినీ క్రోడీకరించి (Summarized) భావితరాలకు ఒక గొప్ప సందేశాన్ని (Great Message) అందించి వెళ్లాడు.

ఆయన జీవితం ఒక సిద్ధాంతం (Theory) నుంచి మరొక సిద్ధాంతానికి మారడం కాదు; ప్రజల విముక్తి కోసం ఏ మార్గం ఫలప్రదమో (Effective Path) దానిని నిరంతరం అన్వేషించిన ఆత్మపరిశీలన (SelfReflection).

" ప్రజల విముక్తి ప్రజల చేతుల్లోనే ఉంది. ప్రజలే పాలకులు కావాలి . ప్రజాస్వామ్యాన్ని (Democracy) ప్రజలే కాపాడాలి. భారత రాజ్యాంగమే (Indian Constitution) పీడిత ప్రజలకు గొప్ప ఆయుధం. ఓటే ప్రజల శక్తి (Power of People)." అనే సందేశాన్ని తన జీవితాంతంలో మనకు అందించాడు.

అందుకే ఆయన " బానిసలారా లేండిరా... ఈ భాంచని బతుకులు వద్దురా.. అదుక్క తింటే మన ఆకలి తీరదు.. గుద్ది గుంజుకుందాము రో.... బానిసలా రా రండి రా ..." అంటూ మనలో ఆత్మగౌరవ జ్యోతిని (Flame of Self Respect) వెలిగించాడు.

ఆ పిలుపు కేవలం ఒక పాట కాదు; అది ఈ దేశ పీడిత ప్రజల విముక్తి ప్రకటన (Declaration of Liberation).

కాబట్టి గద్దరన్నకు నిజమైన నివాళి (True Tribute) అంటే ఆయన చిత్రానికి పూలమాల వేయడం కాదు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని (Indian Constitution) చేతపట్టి ప్రతి గ్రామంలో, ప్రతి బస్తీలో, ప్రతి యువకుడికి, ప్రతి పీడిత కుటుంబానికి రాజ్యాంగ హక్కులను (Constitutional Rights) చేర్చడం.

నైతిక విలువలు (Moral Values) కలిగిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే చైతన్యాన్ని (Awareness) కల్పించడం. ప్రజలే పాలకులయ్యే సమానత్వ సమాజ (Equal Society) నిర్మాణానికి మన జీవితాలను అంకితం చేయడం.

అదే గద్దరన్న మనకు వదిలి వెళ్లిన వారసత్వం (Legacy). అదే ఆయన చివరి సందేశం (Final Message). అదే మనం ఆచరించాల్సిన మార్గం (Path to Follow).

నా దృష్టిలో గద్దరన్న కేవలం ఒక వ్యక్తి కాదు. భారతదేశ పీడిత ప్రజల విముక్తికై ఒక గొప్ప సిద్ధాంతకర్త (Great Ideologue). మరి ముఖ్యంగా తెలంగాణకు దిక్సూచి (Guiding Light).

నా అనుభవంలో గద్దరన్న కంటే గొప్ప అనుభవం, ఆలోచన, ప్రజల పట్ల అంకితభావం (Dedication Towards People) కలిగిన సిద్ధాంతకర్త మరొకరు లేరని నేను గట్టిగా నమ్ముతున్నాను.

**అందుకే నేను చెబుతున్నాను...**

**తెలంగాణ అంటే గద్దరన్న... గద్దరన్న అంటే తెలంగాణ.**

ఈ తెలంగాణ రాష్ట్రం ఎవరి త్యాగాల (Sacrifices) పునాదుల మీద ఏర్పడిందో, ఆ త్యాగాలను భావితరాలు (Future Generations) ఎన్నటికీ మరచిపోకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన, మన అందరిపైనా ఉంది. అందుకే తెలంగాణలోని ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వమే తన సొంత ఖర్చుతో గద్దరన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. అలాగే గద్దరన్న జయంతి, వర్ధంతిని అధికారికంగా (Officially) నిర్వహించాలి. అప్పుడు మాత్రమే భావితరాలు గద్దరన్న చేసిన త్యాగాలు, ఆయన చూపించిన దారి (Path), ఆయన సమాజానికి అందించిన చైతన్యాన్ని (Awareness) తెలుసుకుంటాయి.

ఏ స్వార్థం (Selfish Motive) లేకుండా తన ప్రాణాన్నే పణంగా పెట్టి తెలంగాణ కోసం, పీడిత ప్రజల కోసం జీవితాంతం పోరాడిన త్యాగమూర్తి గద్దరన్న. అలాంటి మహానుభావునికి శాశ్వత గౌరవం (Permanent Respect) ఇవ్వడం అంటే కేవలం మాటల్లో ప్రశంసించడం కాదు; ఆయన స్ఫూర్తిని (Inspiration) చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టే నిర్ణయాలు (Decisions) తీసుకోవడం.

అయితే, ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వానికి ఒక వినమ్ర విజ్ఞప్తి (Humble Request), అదే సమయంలో ఒక ప్రజాస్వామ్యబద్ధమైన డిమాండ్ (Democratic Demand) చేస్తున్నాము.

తెలంగాణ కోసం సర్వస్వం అర్పించిన మహనీయుల పట్ల చూపాల్సిన గౌరవం విషయంలో ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో (Sincerity) ఆలోచించాలి. ఈ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని వ్యతిరేకించినటువంటి చేసిన ఇతర నాయకుల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి దేశ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ప్రతిష్ఠ చేసింది కానీ తెలంగాణ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గద్దరన్నకు ప్రతి జిల్లా నడిబొడ్డున ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో ఎందుకు వెనుకడుగు వేయాలి అనే ప్రశ్న తెలంగాణ సమాజంలో సహజంగానే ఉత్పన్నమవుతోంది.

అందువల్ల ప్రభుత్వం ఈ సున్నితమైన ప్రజాభావాన్ని (Public Sentiment) గౌరవించి, ఎలాంటి ఆలస్యం చేయకుండా ప్రతి జిల్లా కేంద్రంలో గద్దరన్న విగ్రహాలను ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేయాలి. అలాగే గద్దరన్న జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించే నిర్ణయం తీసుకోవాలి. ఇది కేవలం గద్దరన్నకు గౌరవం ఇవ్వడం మాత్రమే కాదు; తెలంగాణ ఆత్మను (Soul of Telangana), తెలంగాణ ఉద్యమ చరిత్రను (Movement History) గౌరవించడం కూడా.

ప్రజల మనోభావాలను (Public Feelings) గౌరవించే ప్రభుత్వమే ప్రజల గుండెల్లో నిలుస్తుంది. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం (Positive Decision) తీసుకుంటే తెలంగాణ ప్రజలు హర్షిస్తారు. ఒకవేళ ప్రజల ఆకాంక్షలను (Aspirations) విస్మరిస్తే, ప్రజాస్వామ్యంలో తుది తీర్పు (Final Verdict) ఎప్పుడూ ప్రజల చేతుల్లోనే ఉంటుందని పాలకులు గుర్తుంచుకోవాలి. అందుకే ఈ సున్నితమైన అంశాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో (Priority) పరిశీలించి, త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని మేము ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడమే కాకుండా, ప్రజల తరఫున గట్టిగా డిమాండ్ చేస్తున్నాము.

గద్దర్ అన్నకు ఈ వర్ధంతి సందర్భంగా నిజమైన నివాళి (True Tribute) అంటే ఆయన పాటలు పాడటం మాత్రమే కాదు; ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానాలు (Answers) వెతకడం.

విప్లవం (Revolution) ఎందుకు? కుల నిర్మూలన (Caste Eradication) ఎందుకు? రాజ్యాంగ పరిరక్షణ (Constitutional Protection) ఎందుకు?

ఈ మూడు ప్రశ్నల చుట్టూనే గద్దర్ జీవితం తిరిగింది.

అణగారిన మనిషి గౌరవంగా జీవించే సమాజం (Respectful Society) కోసం ఆయన కలలు కన్నాడు. ఆ కలను సాకారం చేయడానికి అడవుల్లోనూ నడిచాడు, వీధుల్లోనూ పాడాడు, చివరకు ప్రజాస్వామ్య రాజకీయాల (Democratic Politics) వైపు చూపించాడు.

గద్దర్ శరీరం మన మధ్య లేకపోయినా, ఆయన పాట ఇప్పటికీ వినిపిస్తూనే ఉంది. ఆయన ఆలోచనలు (Thoughts) ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నాయి. ఆయన చూపిన ప్రశ్నలు ఇప్పటికీ సమాజాన్ని నిలదీస్తూనే ఉన్నాయి.

గద్దర్ అమర్ హై!

పీడిత ప్రజల విముక్తి (Liberation of Oppressed People) కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజాకవి గద్దర్ గారికి విప్లవ నీరాజనాలు (Revolutionary Tributes). ఆయన ఆశయాలు (Ideals), ఆయన గళం, ఆయన పోరాట స్ఫూర్తి (Struggle Spirit) తరతరాలకు దిక్సూచిగా (Guiding Light) నిలవాలని ఈ వర్ధంతి సందర్భంగా వినమ్రంగా నివాళులర్పిద్దాం.

జోహార్ గద్దరన్న!
అమర్ రహే గద్దరన్న!
గద్దరన్న ఆశయాలను ముందుకు తీసుకుపోదాం!
భారత రాజ్యాంగం (Indian Constitution) వర్ధిల్లాలి!
సమానత్వ సమాజం (Equal Society) వర్ధిల్లాలి!

జై భీమ్!
జై తెలంగాణ!
జై భారత్!

**తేది 08072026న హన్మకొండ ప్రెస్ క్లబ్ (Press Club) నందు గద్దర్ గళం ఆధ్వర్యంలో, డాక్టర్ జిల్కర శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో గద్దరన్న వర్ధంతి (Death Anniversary) సందర్భంగా సభ నిర్వహించడం జరుగుతుంది.

ఈ సందర్భంగా ప్రజాస్వామికవాదులు (Democrats), మేధావులు (Intellectuals), విద్యార్థులు (Students), కార్మికులు (Workers), కర్షకులు (Farmers) అందరూ పాల్గొని గద్దరన్నకు నివాళులు (Tributes) అర్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. **

GUEST COLUMN

# సాంకేతిక పరిశోధనలో దూసుకెళ్తున్న నిట్ వరంగల్

వరుస పేటెంట్లు, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధనల ప్రచురణలు, ప్రపంచ స్థాయిలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులకు గుర్తింపు పరిశోధన, ఆవిష్కరణలే విద్యాసంస్థల ప్రతిష్ఠను నిర్ణయించే ఈ పోటీ ప్రపంచంలో ఎన్‌ఐటీ వరంగల్ మరోసారి తన సత్తా చాటుతోంది. బోధన, ప్లేస్‌మెంట్లలోనే కాకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, నాణ్యమైన పరిశోధనల ప్రచురణలోనూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. 2026లో ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్, మెటీరియల్స్, కంప్యూటర్ సైన్స్ తదితర విభాగాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు సాధించిన పేటెంట్లు, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనలు సంస్థ పరిశోధన సామర్థ్యాన్ని మరింత బలపరిచాయి.

దేశ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా ఎన్‌ఐటీ వరంగల్‌లోని పరిశోధనా బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన ఆవిష్కరణలకు భారత ప్రభుత్వం పేటెంట్లు మంజూరు చేయడం, అదే పరిశోధనలకు ప్రపంచ ప్రఖ్యాత జర్నల్స్‌లో స్థానం లభించడం విశేషం.

### పేటెంట్లలో ఎన్‌ఐటీ వరంగల్ మరో ముందడుగు

2026 జూన్ 22న ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జి. గోపిరామ్, ప్రొఫెసర్ గండే అరుణ్ కుమార్, పరిశోధక విద్యార్థి ప్రంతిక్ దత్తా అభివృద్ధి చేసిన "A Compact Closely Spaced Dual-Band Bandpass Filter with Single-Band Non-Reciprocity" ఆవిష్కరణకు భారత ప్రభుత్వం పేటెంట్ నం. 592990 మంజూరు చేసింది. 5జీ, 6జీ కమ్యూనికేషన్ వ్యవస్థల్లో అధిక సామర్థ్యంతో పనిచేసే ఫిల్టర్ రూపకల్పనలో ఈ పరిశోధన కీలకంగా నిలిచింది. అదే నెల 25న



మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ గుడిపాడు వెంకటేష్, ప్రొఫెసర్ పి. వంశీకృష్ణ, పరిశోధక విద్యార్థి భూక్య శోభన్ రూపొందించిన "Rotary Ultrasonic Assisted Abrasive Flow Machining for Enhanced Surface Finishing of Biomedical Implants" సాంకేతికతకు పేటెంట్ నం. 593391 లభించింది. వైద్యరంగంలో ఉపయోగించే బయోమెడికల్ ఇంప్లాంట్ల ఉపరితల నాణ్యతను పెంచి వాటి పనితీరును మెరుగుపరచడంలో ఈ సాంకేతికత ఉపయోగపడనుంది.



ఆచార్య బిద్యాధర్ సుబూధి, డైరెక్టర్, నిట్ వరంగల్

ఇంతకుముందు కూడా ఫైబర్ బ్రాగ్ గ్రేటింగ్ (FBG) సెన్సర్లు, అడ్వాన్స్‌డ్ తయారీ సాంకేతికతలు, పవర్ ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ మెటీరియల్స్, సస్టెనబుల్ ఇంజనీరింగ్ వంటి రంగాల్లో ఎన్‌ఐటీ వరంగల్‌కు పలు పేటెంట్లు లభించాయి. దీంతో పరిశోధనను వాణిజ్యపరంగా ఉపయోగించే దిశగా సంస్థ ముందుకు సాగుతోంది.

### అంతర్జాతీయ జర్నల్స్‌లో వరుస ప్రచురణలు

పేటెంట్లతో పాటు ప్రపంచ ప్రఖ్యాత జర్నల్స్‌లో కూడా ఎన్‌ఐటీ వరంగల్ అధ్యాపకులు, పరిశోధకుల పరిశోధనలకు గుర్తింపు లభిస్తోంది.

2026 ఫిబ్రవరిలో సహజ ఫైబర్ కాంపోజిట్ల పనితీరు, వైఫల్యాలపై ప్రొఫెసర్ గుడిపాడు వెంకటేష్ బృందం చేసిన పరిశోధన Failure Analysis in Engineering Structures జర్నల్‌లో ప్రచురితమైంది.

మార్చిలో బయోమెడికల్ ఇంప్లాంట్ల ఉపరితల నాణ్యతపై భూక్య శోభన్, ప్రొఫెసర్ గుడిపాడు వెంకటేష్, ప్రొఫెసర్ పి. వంశీకృష్ణల పరిశోధన Journal of Materials Engineering and Performanceలో వెలువడింది.

జూన్‌లో విద్యుత్ మార్పిడి వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచే సాంకేతికతపై ప్రొఫెసర్ జి. శివకుమార్, ప్రొఫెసర్ కె. శ్రీనివాసరావు తదితరుల పరిశోధనలు International Journal of Circuit Theory and Applications (Wiley), IEEE Transactions on Consumer Electronics వంటి అత్యున్నత అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

అదనంగా కృత్రిమ మేధ (AI), మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, పునరుత్పాదక ఇంధనాలు, నిర్మాణ ఇంజనీరింగ్, పర్యావరణ పరిరక్షణ, మెటీరియల్స్ సైన్స్ వంటి రంగాల్లో కూడా అనేక పరిశోధనలు ప్రచురితమవుతున్నాయి.

### అంతర్జాతీయ వేదికలపై పరిశోధక విద్యార్థులు

ఎన్‌ఐటీ వరంగల్‌కు చెందిన పీహెచ్‌డీ పరిశోధకులు కూడా ప్రపంచ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. 2026లో పలువురు విద్యార్థులు ANRF International Travel Support గ్రాంట్లు సాధించి బెల్జియం, రొమేనియా, గోవా తదితర ప్రాంతాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. వారి పరిశోధనలకు విదేశీ శాస్త్రవేత్తల నుంచి ప్రశంసలు లభించాయి.

పరిశోధనలో బలమైన పునాది ఎన్‌ఐటీ వరంగల్‌లో ప్రస్తుతం వేల సంఖ్యలో పరిశోధన పత్రాలు అంతర్జాతీయ డేటాబేస్‌లలో నమోదయ్యాయి. 125కుపైగా పేటెంట్ దరఖాస్తులు, 60కుపైగా మంజూరైన పేటెంట్లు, 90కుపైగా అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలు, 29 స్టార్టప్‌లు, 1,200కుపైగా పీహెచ్‌డీ పట్టభద్రులతో పరిశోధన ఆధారిత విద్యాసంస్థగా తన ప్రత్యేక గుర్తింపును మరింత బలపరుచుకుంటోంది.

పరిశోధనను ప్రయోగశాలలకే పరిమితం చేయకుండా పరిశ్రమలకు, సమాజానికి ఉపయోగపడే సాంకేతికతగా మలచడంలో ఎన్‌ఐటీ వరంగల్ చేస్తున్న కృషి దేశంలోని ఇతర సాంకేతిక విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది. దీంతో వరంగల్ నగరం విద్యాకేంద్రంగా మాత్రమే కాకుండా పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా కూడా అంతర్జాతీయ గుర్తింపు పొందుతోంది.



- ఇమ్మడి ప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్
హనుమకొండ

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.